ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



దేవదాయ శాఖ జిల్లా అధికారిగా సుధారాణి

- నూకాంబిక ఆలయ ఈవో అన్నపూర్ణ విశాఖ ఏసీగా బదిలీ



సుధారాణి



అన్నపూర్ణ

విశాఖపట్నం/ అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 23 : అనకాపల్లి జిల్లా దేవదాయ శాఖ అధికారిగా (అసిస్టెంట్ కమిషనర్) సుధారాణి నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఈమె విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. అనకాపల్లి ఇన్‌చార్జి ఏసీ రాజారావు స్థానంలో సుధారాణి నియమితులయ్యారు. ఇదిలా ఉండగా అనకాపల్లి నూకాంబిక ఆలయ ఈవో (అసిస్టెంట్ కమిషనర్) అన్నపూర్ణ విశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా నియమితులయ్యారు. నూకాంబిక ఆలయం ఈవోగా ఇంకా ఎవరినీ నియమించలేదు. ఈ విషయమై డీసీ సుజాతను వివరణ కోరగా రెండు, మూడు రోజుల్లో నూకాంబిక ఆలయానికి ఈవోను నియమించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కాగా విశాఖపట్నం అసిస్టెంట్ ఉన్న కె.శిరీషను విజయనగరం జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించారు. సంపత్ వినాయక ఆలయం ఈఓగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న శిరీషకు అక్కడ కొనసాగేందుకు అవకాశం కల్పించారు. విశాఖపట్నం డిప్యూటీ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్.సుజాతకు పదోన్నతి కల్పించి అదే పోస్టులో కొనసాగాలని ఆదేశించారు. దీంతో పాటు కనకమహాలక్ష్మి దేవస్థానం ఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆ ఆలయంలో ఈఓగా ఉన్న డిప్యూటీ కమిషనర్ పి.శ్రీనివాసరెడ్డిని పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈఓగా బదిలీ చేశారు.

నేడు మంత్రి లోకేశ్ విశాఖ రాక

- 25న ఐటీ కంపెనీల ప్రతినిధుల సమావేశానికి హాజరు
- అనంతరం రుషికొండ ఐటీ పార్కు సందర్శన



విశాఖపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ మంగళవారం రాత్రి నగరానికి రానున్నారు. విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి రాత్రి 8.40 గంటలకు బయలుదేరి 9.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. ఎయిర్‌పోర్టు నుంచి రాత్రి 10.10 గంటలకు సెవెన్‌హిల్స్ ఆస్పత్రి వెనుక ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి చేరుకుని బస చేస్తారు. ఈనెల 25వ తేదీన దేశంలో ప్రముఖ ఐటీ కంపెనీల ప్రతినిధులతో నగరంలోని ఒక హోటల్‌లో నిర్వహించే సమావేశంలో లోకేశ్ పాల్గొంటారు. అనంతరం రుషికొండ ఐటీ పార్కును సందర్శించి అక్కడ ఉద్యోగులు, నిపుణులతో భేటీ అవుతారు. బుధవారం రాత్రి తిరిగి విజయవాడ వెళతారు.

తహసీల్దార్లకు మండలాలు కేటాయింపు

- జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ

అనకాపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు బదిలీపై వచ్చిన తహసీల్దార్లకు మండలాలు కేటాయిస్తూ కలెక్టర్ విజయకృష్ణన్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్.రాయవరం తహసీల్దార్ కె.విజయ్‌కుమార్‌ను అనకాపల్లి తహసీల్దారుగా నియమించారు. దేవరాపల్లి తహసీల్దారు ఎం.లక్ష్మిని బుచ్చెయ్యపేటకు, అల్లూరి జిల్లా నుంచి సీహెచ్ నాగమ్మను రోలుగుంటకు, శ్రీకాకుళం జిల్లాకు చెందిన బి.వెంకటరమణను రావికమతానికి, విశాఖపట్నం నుంచి కె.రమాదేవిని వి.మాడుగులకు, రాంబిల్లి నుంచి బి.భాగ్యవతిని కె.కోటపాడుకు, గొలుగొండ నుంచి వై.ఎస్.వి.వి.ప్రసాద్‌ను చీడికాడకు, అనకాపల్లి కలెక్టరేట్ నుంచి పి.లక్ష్మీదేవిని దేవరాపల్లికి, రోలుగుంట నుంచి ఎస్.వరహాలును ఎలమంచిలికి, పార్వతీపురం మన్యం జిల్లా నుంచి వచ్చిన జీవీ జనార్దన్‌ను అచ్యుతాపురానికి తహసీల్దార్లుగా నియమించారు. కలెక్టరేట్ ... మిగతా 8వ పేజీలో

బదిలీలలు

పలు శాఖల్లో గందరగోళంగా ఉద్యోగుల బదిలీల ప్రక్రియ

- ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలకే ప్రాధాన్యం
- సర్వేయర్ల బదిలీల్లో ఇద్దరు ఉద్యోగులు కీలక పాత్ర
- బదిలీ కోసం దరఖాస్తు చేయకపోయినా.. స్థానచలనం
- ఏజెన్సీలో ఆరేళ్లు దాటిన వారిని మళ్లీ అక్కడే ఉంచిన వైనం
- మైదాన ప్రాంతంలోనూ ఇదే పరిస్థితి
- వాణిజ్య పన్నుల విభాగంలో పైరవీలు
- బదిలీలు చేసిన రెండు రోజుల్లోనే మార్పులు



(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో చేపట్టిన ఉద్యోగుల బదిలీలు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాప్రతినిధుల సిఫారసులకు అధికారులు తలొగ్గి, వివిధ శాఖల్లో బదిలీల ప్రక్రియను అస్తవ్యస్తంగా చేపట్టారని ఉద్యోగ వర్గాలు ఆరోపిస్తున్నాయి. బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వం స్పష్టం చేసినప్పటికీ కొంతమంది అధికారులు నిబంధనలు పక్కన పెట్టినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. అనకాపల్లి జిల్లా కొత్తగా ఏర్పడినప్పటికీ ఈ ఏడాది సాధారణ బదిలీలు ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ప్రాతిపదికనే జరిగాయి.

బదిలీలకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ గడువు శనివారం సాయంత్రంతో ముగియడంతో ఆదివారం సాయంత్రం నుంచి పలు ప్రభుత్వ శాఖల్లో 300 మందికిపైగా ఉద్యోగులను బదిలీ చేశారు. అయితే కొన్ని శాఖల్లో నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు జరిగాయని, రాజకీయ పలుకుబడి, సిఫారసు లేఖలు ఉన్నవారికి కావాల్సిన చోట పోస్టింగ్‌లు దక్కాయని అంటున్నారు. ప్రధానంగా రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్స్ రికార్డులు, వాణిజ్య పనుల శాఖల బదిలీల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. రెవెన్యూ శాఖలో తహసీల్దార్ల బదిలీల విషయంలో పైరవీలకు పెద్ద పీట వేశారని అంటున్నారు. ఎన్నికలకు ముందు వరకు ఇదే జిల్లాలో పనిచేసి, ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన పలువురు తహసీల్దార్లు, తిరిగి తమకు కావాల్సిన చోట పోస్టింగ్ కోసం ఎమ్మెల్యేల నుంచి సిఫారసు లేఖలు తీసుకుని ఉన్నతాధికారులకు అందించారు. దీంతో తహసీల్దార్లకు మండలాల కేటాయింపు అధికారులకు తలనొప్పిగా మారింది. ప్రజాప్రతినిధులు సిఫారసు లేఖలు ఇచ్చిన వారికి అనకాపల్లి, కశింకోట, ఎలమంచిలి, ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట, సబ్బవరం, పరవాడ, అచ్యుతాపురం మండలాల్లో తహసీల్దారు పోస్టింగులు ఇచ్చినట్టు తెలిసింది.

బదిలీ కోసం దరఖాస్తు చేయకపోయినా....

సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ విభాగంలో సర్వేయర్ల బదిలీలు గందరగోళంగా మారాయి. బదిలీల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పరిశీలించి కమిషనరేట్ నుంచి బదిలీలు చేపట్టారు. అయితే బదిలీ కోసం దరఖాస్తు చేసుకోని వారిని బదిలీ చేశారని, తమను ప్రసన్నం చేసుకున్న వారికి పోస్టింగులు ఇచ్చేందుకు అడ్డగోలుగా బదిలీలు చేశారని పలువురు సర్వేయర్లు వాపోతున్నారు. నర్సీపట్నంలో పనిచేస్తున్న మండల సర్వేయర్ టీడీవీ ప్రసాద్ గత ఏడాది బదిలీపై అక్కడకు వెళ్లారు. ఆయన బదిలీ కోసం దరఖాస్తు చేసుకోకపోయినప్పటికీ నాతవరం మండలానికి బదిలీ చేశారు. ఏడాది కిందట అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీపై వెళ్లిన వెంకటేశ్వర్లు అనే సర్వేయర్‌ను నర్సీపట్నం బదిలీ చేశారు. అదేవిధంగా రంపచోడవరం మండల సర్వేయర్ బాలకృష్ణ, విజయనగరం జిల్లాకు చెందిన మండల సర్వేయర్ తిరుపతిరావు, శ్రీకాకుళం జిల్లాకు చెందిన ప్రభాకరరావు, చీడికాడ మండల సర్వేయర్ కుమారస్వామిలను ఏడాది సర్వీసు పూర్తి కాకుండానే విశాఖపట్నం జీవీఎంసీ పరిధిలోకి బదిలీ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండల సర్వేయర్ కేవీవీ సత్యనారాయణ గత ఆరేళ్లుగా ఏజెన్సీలోనే పనిచేస్తున్నారు. తనను బదిలీ చేయాలని ఆయన చేసిన దరఖాస్తును అధికారులు బుట్టదాఖలు చేశారు. ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తయితే తప్పనిసరిగా బదిలీ చేయాలని నిబంధన వుంది. కానీ పెదబయలు సర్వేయర్ సత్యనారాయణను అక్కడే వుంచేశారు. మరోవైపు ఏడాది సర్వీసు పూర్తి చేసిన వారికి నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు జరిగాయి. బదిలీ చేయాలని తాము దరఖాస్తు చేసుకోకపోయినా బదిలీ చేయడంపై మండల సర్వేయర్లు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తరాంధ్ర జిల్లాల్లో మండల సర్వేయర్ల బదిలీల వ్యవహారాలను చూసేందుకు ప్రభుత్వం నియమించిన ఆ శాఖకు చెందిన ఒక ఉన్నతాధికారి నిబంధనలను పూర్తిగా పక్కన పెట్టి, అక్రమ బదిలీలకు అవకాశం కల్పించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డిప్యూటీ సర్వేయర్ల బదిలీలు జిల్లా ఏడీ కార్యాలయం సూపరింటెండెంట్‌ల ఆధ్వర్యంలో జరిగాయి. ఈ బదిలీల్లో అర్హులకు అన్యాయం జరిగిందనే విమర్శలున్నాయి. ఏఎస్ఆర్ జిల్లాలో గత ఆరేళ్లుగా పనిచేస్తున్న డిప్యూటీ సర్వేయర్లు తమను మైదాన ప్రాంతానికి బదిలీ చేయాలని దరఖాస్తు చేసుకున్నా.. బదిలీ చేయలేదు. మైదాన ప్రాంతంలో ఆరేళ్లుగా పనిచేస్తున్న డిప్యూటీ సర్వేయర్లను మళ్లీ మైదాన ప్రాంతంలోనే ... మిగతా 8వ పేజీలో

స్వర్ణాంధ్ర-2047 ప్రణాళికలు సిద్ధం చేయండి



స్వర్ణాంధ్ర-2047 పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి, ఇతర అధికారులు

కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంపై జేసీ జాహ్నవితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని శాఖల అధికారులు ఈ నెల 30వ తేదీలోగా మండల స్థాయిలో నివేదికలు రూపొందించి జిల్లా అధికారులకు పంపాలని, స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల ప్రణాళికలను అక్టోబరు 15వ తేదీ నాటికి సిద్ధం చేయాలన్నారు. ప్రతి ఏడాది లక్ష్యంపై డాక్యుమెంటేషన్ తయారు చేయాలని సూచించారు. జిల్లాలో టూరిజం, టెంపుల్ టూరిజం, వ్యవసాయ, ఉద్యాన, మత్స్య రంగాల అభివృద్ధి ప్రణాళికలు సమగ్రంగా ఉండాలన్నారు. కళాశాలల్లో, పాఠశాలల్లో విజన్ ఆంధ్ర-2047పై విద్యార్థులకు పోటీలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర-2047 పోస్టర్‌ను ఆవిష్కరించారు.

భారీ గోతులు.. వాహనదారుల పాట్లు

నరకప్రాయంగా బీఎన్ రోడ్డులో ప్రయాణం



కొత్తకోట ఆశమ్మ బడి వద్ద గొయ్యిలో కూరుకుపోయిన లారీ

- గోతుల్లో కూరుకుపోతున్న వాహనాలు
- దెబ్బతింటున్న విడిభాగాలు





బీఎన్ రోడ్డులో కొత్తకోట జూనియర్ కళాశాల వద్ద గోతిలో కూరుకుపోయిన వ్యాన్‌ను బయటకు తీసే ప్రయత్నం.. (ఇన్‌సెట్‌లో) ట్రాక్టర్ సాయంతో వ్యాన్‌ను బయటకు తీస్తున్న దృశ్యం

రావికమతం, సెప్టెంబరు 23: కొద్దిపాటి వర్షం కురిస్తే చాలు.. భీమునిపట్నం-నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో వాహన చోదకులు నానాపాట్లు పడుతున్నారు. పలుచోట్ల ఏర్పడిన భారీ గోతుల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో సరకు రవాణా చేస్తున్న వాహనాలు ఈ గోతుల్లో కూరుకుపోయి మొరాయిస్తున్నాయి. కొన్ని సార్లు ఛాసిస్‌లు విరిగిపోతున్నాయి. స్థానికంగా వున్న ట్రాక్టర్లను రప్పించి, కూరుకుపోయిన వాహనాలను గోతుల్లో నుంచి బయటకు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ఈ రోడ్డు మీదుగా భారీ గ్రానైట్ ట్రాలర్లు వెళ్ల డంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు ఏళ్ల తరబడి వీటిని పూడ్చకపోవడం, బీఎన్ రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతుండడంతో రహదారి పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. రావికమతం మండలం కొత్తకోట హైస్కూల్, ఆశమ్మ బడి వద్ద గోతుల్లో ఆదివారం ... మిగతా 8వ పేజీలో

జడ్పీలో బదిలీలు

ఉమ్మడి జిల్లాలో 154 మందికి స్థానచలనం

- జాబితాలో 29 మంది ఎంపీడీవోలు...



విశాఖపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా పరిషత్ పరిధిలో ఎంపీడీవో నుంచి అటెండర్ వరకు మొత్తం 154 మందికి సోమవారం బదిలీ అయ్యింది. ఈ జాబితాలో 29 మంది మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవో) ఉన్నారు. బదిలీల ప్రక్రియలో భాగంగా జిల్లా నుంచి తొమ్మిది మంది ఇతర జిల్లాలకు వెళ్లగా, ఇతర జిల్లాల నుంచి పది మంది ఎంపీడీవోలు వచ్చారు.

తాజా బదిలీల్లో భాగంగా ఆనందపురం ఎంపీడీవో ఎ.లవరాజును అరకులోయ బదిలీ చేసి, ఆయన స్థానంలో భీమిలి ఎంపీడీవో వి.జానకిని నియమించారు. నాతవరం ఎంపీడీవో ఎస్.హనుమంతురావును భీమిలి బదిలీ చేశారు. అచ్యుతాపురం ఎంపీడీవో వి.విజయలక్ష్మిని బుచ్చెయ్యపేట బదిలీ చేసి, అక్కడ పనిచేస్తున్న ఎంవీ సువర్ణరాజును దేవరాపల్లి మార్చారు. ఇప్పటివరకూ దేవరాపల్లిలో పీఆర్ఏఈ ఇన్‌చార్జి ఎంపీడీవోగా వ్యవహరిస్తున్నారు. అదేవిధంగా చీడికాడ ఎంపీడీవో ఎ.జయప్రకాశరావును పాయకరావుపేట బదిలీ చేసి, ఆయన స్థానంలో పరవాడ ఎంపీడీవో వి.హేమసుందరరావును నియమించారు. చోడవరం నుంచి ఎస్డీ శ్యామ్‌సుందర్‌ను పరవాడ బదిలీ చేసి, కొత్తగా వచ్చిన పీవీఎస్‌జే ఆంజనేయులుకు చోడవరం ఎంపీడీవోగా పోస్టింగ్ ఇచ్చారు. గొలుగొండలో పనిచేస్తున్న ఎస్.డేవిడ్‌రాజును ఎస్.రాయవరం బదిలీ చేసి, ఆయన స్థానంలో కొయ్యూరు ఎంపీడీవో ఎ.మేరీ రోజ్‌ను నియమించారు. ఆమె స్థానంలో సబ్బవరంలో పనిచేస్తున్న బి.రమేష్‌నాయుడును నియమించి కొత్తగా వచ్చిన పద్మజకు సబ్బవరం ఎంపీడీవోగా పోసింగ్ ఇచ్చారు. నక్కపల్లి ఎంపీడీవో మరో జిల్లాకు బదిలీ కాగా అక్కడ కార్యాలయ సూపరింటెండెంట్ డి.సీతారామరాజుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. నర్సీపట్నం ఎంపీడీవో ఎం.జయమాధవిని రాంబిల్లి, అక్కడ ఉన్న కేవీఎస్ కొండలరావును ఎలమంచిలి బదిలీ చేశారు. ఎలమంచిలి ఎంపీడీవో కె.అప్పలనాయుడు వేరే జిల్లాకు బదిలీపై వెళ్లారు. రోలుగుంట ఎంపీడీవో కె.ప్రభాకరరావును అచ్యుతాపురం బదిలీ చేసి...ఆయన స్థానంలో కొత్తగా వచ్చిన వీఎస్ నాగేశ్వరరావును ... మిగతా 8వ పేజీలో

జన ఔషధిలో మందుల కొరత

- ప్రాంతీయ ఆస్పత్రిలోనే మందుల షాపు
- గతంలో ఎంతో ఆదరణ
- తక్కువ ధరకు దొరుకుతుండడంతో డిమాండ్
- ప్రస్తుతం బీపీ, షుగర్‌కు కూడా మాత్రలు దొరకని వైనం
- నీరుగారుతున్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యం



ప్రాంతీయ ఆస్పత్రిలోని జన ఔషధి కేంద్రం

నర్సీపట్నం, సెప్టెంబరు 23: ప్రాంతీయ ఆస్పత్రిలోని ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి కేంద్రంలో మందుల కొరత తీవ్రంగా ఉంది. కనీసం బీపీ, షుగర్ వంటి వ్యాధులకు కూడా మందులు దొరకడం లేదు. ఎప్పుడు అడిగినా స్టాక్ లేదని సమాధానం చెబుతున్నారు. దీంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు.

గత టీడీపీ ప్రభుత్వంలో మెప్మాలోని ఎస్‌హెచ్‌జీ సభ్యురాలికి జనరిక్ మందుల షాపు మంజూరు చేశారు. ప్రాంతీయ ఆస్పత్రిలోని అత్యవసర విభాగం పక్కన షాపు కేటాయించారు. అన్ని రకాల యాంటీ బయాటిక్స్, జ్వరం, ఒంటి నొప్పులు, బీపీ, షుగర్ మందులు లభ్యమయ్యేవి. ఇటీవల బీపీ, షుగర్ మందులు కూడా లభించడం లేదని పలువురు రోగులు వాపోతున్నారు. ఇక్కడ జనరిక్ మందుల నిల్వలు అయిపోతే విజయవాడ కేంద్రంగా సరఫరా చేసేవారు. ఇక్కడకు అవసరమైన మందులు ఇండెంట్ పెట్టిన రెండు, మూడు రోజుల్లో వెంటనే స్టాక్ పంపించేవారు. ఇప్పుడు విజయవాడలో జన ఔషధి జనరిక్ మందులు హోల్‌సేల్ స్టాక్ పాయింట్ ఎత్తేసినట్టు తెలిసింది. అవసరమైన మందుల కోసం ఇండెంట్ పెట్టినప్పటికీ నెలల తరబడి మందులు పంపడం లేదు. దీంతో తక్కువ ధరలకు అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు.

ప్రభుత్వ లక్ష్యం ఇదీ..

అందరికీ తక్కువ ధరలకు నాణ్యమైన జనరిక్ ఔషధాలను అందుబాటులో ఉంచే లక్ష్యంతో ప్రధాన మంత్రి భారతీ జన ఔషధి ప్రయోజన పథకం కింద 2008లో కేంద్ర ప్రభుత్వం దీనిని ప్రారంభించింది. బహిరంగ మార్కెట్‌లోని మందులకు, ఇక్కడి మందులకు ధరలో వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం సరఫరా చేస్తుండడంతో నమ్మకం పెరిగి పేదలు, మధ్య తరగతి ప్రజలు ఈ మందులకు బాగా అలవాటు పడ్డారు. జనరిక్ మందులపై అవగాహన పెరిగి ఎక్కడెక్కడ నుంచో వచ్చి ఏరియా ఆస్పత్రిలో మందులు కొనుగోలు చేస్తున్నారు. బీపీ, షుగర్ టాబ్లెట్స్ నెలకి సరిపడా ఒకేసారి కొనుగోలు చేస్తే బయట మెడికల్ షాపుల్లో కంటే ఇక్కడ 80 శాతం డబ్బులు మిగులుతున్నాయి. అయితే ప్రస్తుతం ప్రాంతీయ ఆస్పత్రిలోని జనరిక్ మందుల షాపులో చాలా మందులు దొరకకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జనరిక్ మందుల షాపులో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

గంజాయి కట్టడిపై ప్రత్యేక దృష్టి: మంత్రి అనిత -7లో

క్రైం... crime news

మూడు కిలోల గంజాయితో యువకుడి అరెస్టు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 23: గంజాయి రవాణా చేస్తున్న స్థానిక సత్యనారాయణపురం పంచాయతీ సుబ్రహ్మణ్య కాలనీకి చెందిన నీలగిరి హరీశ్‌ను సోమవారం రామాపురం కాలనీ వద్ద అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. హరీశ్ అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి కొనుగోలు చేసి తీసుకువచ్చి చిన్న చిన్న ప్యాకెట్లు కట్టి అమ్మకాలు చేస్తున్నాడని ఆయన చెప్పారు. దీంతో అతని కదలికలపై నిఘా వుంచామని, సోమవారం ఏజెన్సీ నుంచి ద్విచక్ర వాహనంపై గంజాయితో వస్తున్నట్టు సమాచారం అందిందని పేర్కొన్నారు. రామాపురం కాలనీ వద్ద నిఘా వేసి, హరీశ్‌ను అరెస్టు చేసి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ద్విచక్ర వాహనం, రూ.1700 నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసును పట్టణ ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

సెక్యూరిటీ ఉద్యోగి మృతి

▸▸ కంపెనీ గేటు ముందు మృతుని బంధువుల ఆందోళన

రాంబిల్లి, సెప్టెంబరు 23: ప్రత్యేక ఆర్థిక మండలి(ఎస్ఈజెడ్)లోని నెరోలాక్ కంపెనీలో సెక్యూరిటీగా పనిచేస్తూ కడుపునొప్పికి గురైన సీహెచ్.నూకరాజు(28) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలంటూ రాత్రి సుమారు 7:30 గంటల ప్రాంతంలో బంధువులు కంపెనీ గేటుముందు మృతదేహాన్ని ఉంచి ఆందోళనకు దిగారు. కంపెనీలో విధులు నిర్వహిస్తున్న సమయంలోనే నూకరాజుకు కడుపునొప్పి వచ్చిందని, అందువల్ల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎస్ఐ నాగేంద్రను వివరణ కోరగా.. నెరోలాక్ కంపెనీలో సెక్యూరిటీగా పనిచేస్తున్న నూకరాజు ఈ నెల 21న విధులు నిర్వహిస్తున్న సమయంలో కడుపునొప్పి రావడంతో కేజీహెచ్‌కు తరలించారని, అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడన్నారు. నూకరాజు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేస్తే వెంటనే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ చెప్పారు.

క్రైస్తవులపై దాడులకు నిరసన



కలెక్టరేట్ ముందు బైఠాయించిన క్రైస్తవ సంఘాల నాయకులు

తుమ్మపాల (అనకాపల్లి), సెప్టెంబర్లు 23: ఎలమంచిలిలో ఇటీవల క్రైస్తవులపై జరిగిన దాడులకు నిరసనగా సోమవారం క్రైస్తవ సంఘాల నాయకులు, పాస్టర్లు 'చలో కలెక్టరేట్' కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రైస్తవులపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కలెక్టర్, ఎస్పీలకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా క్రైస్తవ ప్రగతి పరిరక్షణ సమాఖ్య ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు వీకే జేమ్స్, యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఛైర్మన్ కేబీకే పీటర్ మాట్లాడుతూ.. ప్రపంచానికి శాంతిని పంచే క్రైస్తవ సమాజంపై మతోన్మాదులు దాడులకు పాల్పడడం అన్యాయమన్నారు. పోలీసులు ఒక వర్గానికి కొమ్ము కాయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల నాయకులు పండ్రాన తిమోతి, బి.యోహాను, క్రాంతి పాల్, కిరణ్‌కుమార్, కేపీడీఆర్ ప్రసాద్, జాన్సన్, బెనర్జి, ప్రమోద్‌కుమార్, ఎం.సాల్మన్‌రాజు, సీహెచ్.రాజు, ఎం.సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా డీఎస్ఎన్ఎల్‌యూ వ్యవస్థాపక దినోత్సవం



ప్రసంగిస్తున్న విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు

సబ్బవరం, సెప్టెంబరు 23: సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం (డీఎస్ఎన్ఎల్‌యూ) 17వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉప కులపతి ప్రొఫెసర్ డి.సూర్య ప్రకాశరావు మాట్లాడుతూ, వర్సిటీ నలుగురు విద్యార్థులతో ప్రారంభమైందని, అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం వెయ్యి మందికిపైగా విద్యార్థులు వున్నారని చెప్పారు. 12 రీసెర్చ్ సెంటర్స్, ఐపీఆర్ ఛైర్ వంటి అనేక అంశాలు, కార్యక్రమాలతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుందన్నారు. విశ్వవిద్యాలయం పురోగతిలో టీచింగ్, నాన్-టీచింగ్ సిబ్బంది పాత్ర మరువలేనిదన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్ర నాథ్ మాదాసు, అధాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నూకాంబికను దర్శించుకున్న జిల్లా ఎస్పీ



బాలాలయంలో అమ్మవారిని దర్శించుకుని హారతి స్వీకరిస్తున్న ఎస్పీ దీపిక

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 23 : స్థానిక నూకాంబిక అమ్మవారిని సోమవారం జిల్లా ఎస్పీ ఎం.దీపిక దర్శించుకున్నారు. తొలుత ఆలయానికి వచ్చిన ఆమెకు సిబ్బంది స్వాగతం పలికారు. బాలాలయంలో అమ్మవారికి ఎస్పీ పూజలు చేశారు. అనంతరం అర్చకులు ఎస్పీని ఆశీర్వదించారు. ఆలయ మాజీ చైర్మన్ బీఎస్ఎంకే జోగినాయుడు అమ్మవారి చిత్రపటాన్ని ఎస్పీకి అందజేశారు.

ఈ-కంటెంట్ రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్‌గా దొర



ఉపాధ్యాయుడు సీహెచ్ఎస్ దొర

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 23: ఈ-కంటెంట్ రాష్ట్రస్థాయి రిసోర్సు పర్సన్‌గా మండలంలోని వెంకటనగరం పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు సిహెచ్.ఎస్.దొర ఎంపికైనట్టు ఎంఈవో కె.ఎస్.గాంధీ తెలిపారు. కేంద్ర సాంకేతిక విద్యా సంస్థ (సీఐఈటీ), కేంద్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్‌టీ-న్యూఢిల్లీ) ఆధ్వర్యంలో ఈ-కంటెంట్ అభివృద్ధి కోసం దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి ఉపాధ్యాయులను స్టేట్ రిసోర్స్ గ్రూప్ మెంబర్స్‌గా ఎంపికచేసి వారికి ఆన్‌లైన్ శిక్షణ ఇస్తారని ఆయన తెలిపారు. దీనిలో భాగంగా ఈ నెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఏపీ నుంచి ఎంపిక చేసిన 20 మంది ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ శిక్షణలో ఇస్తారన్నారు. వీరిలో పాయకరావుపేట మండలం వెంకటనగరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సిహెచ్.ఎస్.దొర వున్నారని ఎంఈవో వెల్లడించారు. దొర ప్రస్తుత 1వ తరగతి నుంచి 5వ తరగతి ప్రాథమిక స్థాయికి సంబంధించిన ఆంగ్ల పాఠ్య పుస్తక రచయిత అని, ప్రస్తుతం అనకాపల్లి జిల్లా దీక్ష కో-ఆర్డినేటర్‌గా సేవలందిస్తున్నారన్నారు. ఈ-కంటెంట్‌లో భాగంగా 4వ తరగతి ఇంగ్లిష్‌కు సంబంధించి రూపొందించిన వీడియోలు ఏపీ ఈ-పాఠశాల యాప్‌నందు పొందు పరిచానని, ఎన్‌సీఈఆర్‌టీ నిర్వహించే శిక్షణను సద్వినియోగం చేసుకుని చక్కని ఈ-కంటెంట్ రూపకల్పనకు కృషి చేస్తానని ఉపాధ్యాయుడు దొర తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	98.00
లైవ్ ధర	118.00
విత్ స్కిన్	206.00
స్కిన్ లెస్	216.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

గంజాయి కట్టడిపై ప్రత్యేక దృష్టి

- ఆడపిల్లలపై అఘాయిత్యాలు, మద్యం, గంజాయి నిందితులను ఉపేక్షించొద్దు
- కూటమి నేతలు చెప్పినా విడిచిపెట్టకండి
- పోలీసులకు హోం మంత్రి అనిత ఆదేశం
- 'పేట నియోజకవర్గంలో 20 రోజుల్లో మెగా జాబ్ మేళా
- ప్రజల సమస్యలపై ఫిర్యాదుల పెట్టెలు



'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో మాట్లాడుతున్న హోం మంత్రి వంగలపూడి అనిత

ఎస్.రాయవరం, సెప్టెంబరు 23: ఆడ పిల్లల మీద అఘాయిత్యాలు, గంజాయి, అక్రమ మద్యం, నాటుసారా నేరాల్లో పట్టుబడిన నిందితులను కూటమి నాయకులు చెప్పినా వదలొద్దని హోం మంత్రి వంగలపూడి అనిత పోలీసులను ఆదేశించారు. మండలంలోని ధర్మవరం అగ్రహారంలో సోమవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడుతూ, వైసీపీ పాలనలో గంజాయి సాగు, రవాణా విపరీతంగా పెరిగిపోయాయని, చిన్న పిల్లలు సైతం గంజాయి మత్తుకు బానిసలు అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో ఎక్కడా గంజాయి ఆనవాళ్లు వుండకూడదని, దీనిపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆమె ఆదేశించారు.

పాయకరావుపేట నియోజకవర్గం ప్రజలు తనను భారీ మెజారిటీతో గెలిపించారని, దీంతో నియోజకవర్గం అభివృద్ధి విషయంలో తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే పలు హామీలను అమలు చేశామని, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను వెయ్యి రూపాయలు పెంచామని, ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశామని, అన్న క్యాంటీన్లను పునరుద్ధరించామని, ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని ఆమె చెప్పారు. డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధం ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిందని, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి రాజధాని అమరావతి అభివృద్ధి కోసం రూ.15 వేల కోట్లు మంజూరు చేసేలా కృషి చేశారని మంత్రి అనిత చెప్పారు. గత సీఎం జగన్‌రెడ్డి తన కేసుల మాఫీ కోసం తరచూ డిల్లీ వెళ్లగా, చంద్రబాబు రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టుల కోసం డిల్లీ వెళుతున్నారని అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరిపాలనలో తనదైన ముద్ర వేస్తున్నారని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో ఒకేరోజు యగ్రామ సభలు నిర్వహించి రికార్డు సృష్టించారని కొనియాడారు.

20 రోజుల్లో మెగా జాబ్ మేళా

నిర్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం పలు పరిశ్రమల యాజమాన్యాలతో మాట్లాడి, ఇరవై రోజుల్లో నియోజకవర్గంలో మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేయిస్తానని మంత్రి అనిత హామీ ఇచ్చారు. మండలంలో వివిధ ప్రాంతాల్లో ఐదుచోట్ల ఫిర్యాదు పెట్టెలను ఏర్పాటు చేయిస్తున్నానని, ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలు, ఫిర్యాదులను ఈ పెట్టెల్లో వేయాలని కోరారు. ఫిర్యాదిదార్ల పేర్లను గోప్యంగా వుంచుతామని, ఒకవేళ ఫిర్యాదు చేసిన వారి పేరు బయటకు వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు.

వైసీపీ హయాంలో తిరుమల వేంకటేశ్వర స్వామి ప్రసాదం లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించిన విషయం బయటపడడంతో భక్తులు తీవ్ర ఆవేదన చెందారని, శ్రీవారి ప్రసాదాన్ని అపవిత్రం చేసిన జగన్‌రెడ్డికి గత ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారని అనిత అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్బలక్ష్మి, తహసీల్దార్ విజయకుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు,జనసేన, బీజేపీ నాయకులు తోట నగేశ్, రవిరాజు, గెడ్డం బుజ్జి, అమలకంటి అబద్ధం, వెంకటరాజు, నవీన్‌రాజు, అల్లు నరసింహమూర్తి, గుర్రం రామకృష్ణ, పల్లెల బుజ్జి, భీమరశెట్టి శ్రీనివాసరావు, సుంకర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పాలన

▸▸ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు



ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

మాకవరపాలెం, సెప్టెంబరు 23: రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పాలన అందిస్తున్నామని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. మాకవరపాలెం మండలం లచ్చన్నపాలెంలో సోమవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీకి రూ.6.48 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేశారన్నారు. దీపావళి నుంచి అర్హులైన మహిళలకు మూడు గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నట్టు తెలిపారు. మండలంలో డ్రైనేజీల నిర్మాణానికి లచ్చన్నపాలెం గ్రామానికి రూ.2.45 కోట్లు, పైడిపాల గ్రామానికి రూ.2.8 కోట్లు, జి.కోడూరు గ్రామానికి రూ.1.29 కోట్లు మంజూరు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పలు హామీలను నెరవేర్చిందన్నారు. రోలుగుంట మండలంలో ఓ ప్రైవేటు వైద్యాధికారి మత్తు ఇవ్వకుండానే ఆపరేషన్లు చేస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని, వెంటనే ఆ వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని ఆర్‌డీవో జయరాంను ఆదేశించారు. అనంతరం ఐసీడీ ఎస్ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి, మహిళలకు సీమంతాలు నిర్వహించారు.

ప్రజల సొమ్ముతో విశాఖ డెయిరీ యాజమాన్యం జల్సా

రైతుల సొమ్ముతో విశాఖ డెయిరీ పాలకవర్గం జల్సా చేస్తోందని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. సొసైటీ సొమ్ముతో షీలానగర్‌లో ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో రైతులకు నామమాత్రపు చికిత్సలు చేస్తున్నారని విమర్శించారు. రైతుల పిల్లలకు ఇంజనీరింగ్ చదువు పేరుతో ఎలమంచిలిలో కొనుగోలు చేసిన స్థలాన్ని అమ్మేశారన్నారు. ఇటీవల పాల సంఘాల అధ్యక్షులకు డెయిరీలో సమావేశం నిర్వహించి 4 గ్రాముల చొప్పున బంగారం ఇచ్చారని, అందుకు సంబంధించి సొసైటీల నుంచి రూ.39,100 చొప్పున రైతుల సొమ్ము తీసుకున్నారని ఆరోపించారు.

రెండు సంవత్సరాలుగా రైతులకు బోనస్ ఇవ్వడం లేదన్నారు. ఈ వ్యవహారంపై రైతులు ముందుకు రావాలని, అవసరమైతే డెయిరీ ఛైర్మన్‌ను మారుస్తామని స్పష్టం చేశారు. వచ్చే శాసనసభ సమావేశాల్లో డెయిరీపై చర్చిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోతల రామలక్ష్మి, ఆర్‌డీవో జయరాం, టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు, జనసేన నాయకుడు సూర్యచంద్ర, టీడీపీ నాయకులు పోతల అప్పలనాయుడు, పోతల రాంబాబు, అల్లు రామునాయుడు, శేషుకుమార్ పాల్గొన్నారు.

తహసీల్దారు బదిలీల్లో సిఫారసులకే పెద్దపీట!

- ఏజెన్సీలో పోస్టింగ్స్‌కు సంబంధించి నిబంధనలు పట్టించుకోలేదని విమర్శలు
- డీటీల బదిలీల్లోనూ అదే తంతు
- కోర్టుకు వెళ్లేందుకు పలువురి సిద్ధం

విశాఖపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు బదిలీల్లో ప్రజా ప్రతినిధుల సిఫారసులకే పెద్దపీట వేశారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఏజెన్సీలో పోస్టింగ్స్‌కు సంబంధించి నిబంధనలు (50 ఏళ్లు దాటిన వారిని ఏజెన్సీకి బదిలీ చేయకూడదు) పట్టించుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తహసీల్దారు బదిలీల్లో విశాఖ జిల్లా నుంచి ఒక్కరినే పంపుతామని సంకేతాలు ఇచ్చిన అధికారులు దానినే అమలుచేశారు. అది కూడా ఎన్నికల తరువాత విశాఖ కలెక్టరేట్‌లో పోస్టింగ్ ఇచ్చినా విధుల్లో చేరని శ్యామ్‌కుమార్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లాకు పంపారు. శ్యామ్‌కుమార్ వయస్సు రమారమి 60 సంవత్సరాలు. ఆయన కంటే వయస్సులో చిన్నవారైన అధికారులను విశాఖ జిల్లాలోనే కొనసాగించారు. అలాగే ఏజెన్సీలో పనిచేస్తూ విశాఖ జిల్లాకు ఆప్షన్ పెట్టుకున్న ఏడుగురిలో నలుగురిని విశాఖ, అనకాపల్లి బదిలీ చేసి, మిగిలిన ముగ్గురిని...తిరుమలరావు (61 సంవత్సరాలు), నాగరాజు (55 ఏళ్లు), చిన్నకృష్ణ (52 ఏళ్లు) అక్కడే ఉంచారు. వీరు ముగ్గురు ఏజెన్సీలో రెండేళ్లకు మించి పనిచేస్తున్నారు. విశాఖ జిల్లాలో జూనియర్లను కొనసాగించారు. వీరిలో కొందరు ఏజెన్సీలో ఒక్కరోజు కూడా పనిచేయలేదు. అయితే సంఘ నేతలని ఒకరిద్దరని, ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖల కారణంగా మరికొందరిని బదిలీల నుంచి మినహాయించారు. రెండు నెలల క్రితం తహసీల్దార్ల పోస్టింగ్స్‌లో ముగ్గురి, నలుగురి విషయంలో వివాదాలు చేలరేగినప్పుడు వారిలో కనీసం ఇద్దరు లేదా ముగ్గురికి స్థానచలనం ఉంటుందని భావించారు. అయితే సిఫారసులు బాగా పనిచేయడంతో వారి జోలికి వెళ్లలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా రెండు నెలల క్రితం బదిలీల్లో ఇద్దరికి తగిన ప్రాధాన్యం ఉన్న మండలాలు దొరకలేదు. వారిరువురూ తమకున్న పలుకుబడిని ఉపయోగించుకుని అనకాపల్లి జిల్లాకు వెళ్లిపోయారు. వీరిరురూ 50 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న వారే. ఇదిలావుండగా బదిలీల్లో అన్యాయం జరిగిందని భావిస్తున్న కొందరు తహసీల్దార్లు కోర్టుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. కాగా 40 మంది డిప్యూటీ తహసీల్దార్లు, 55 మంది సీనియర్ అసిస్టెంట్లు, 14 మంది జూనియర్ అసిస్టెంట్లను బదిలీ చేస్తూ ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ ఉత్తర్వులు విడుదల చేశారు. డిప్యూటీ తహసీల్దార్లను కూడా నగరం, దానికి ఆనుకుని మండలాల్లో అటుఇటుగా సర్దేశారు తప్ప ఏజెన్సీకి బదిలీ చేయలేదు. విశాఖ ఆర్డీవో కార్యాలయంలో డీటీగా పనిచేసే సూర్యకళ (53 సంవత్సరాలు)ను ఏజెన్సీకి బదిలీ చేయడంపై రెవెన్యూ వర్గాల్లో ఆశ్చర్యం వ్యక్తమవుతుంది. యువకులకు కాదని 50 ఏళ్లు దాటిన ఒంటరి మహిళను ఏజెన్సీకి పంపడం సమంజసం కాదనే వాదన వినిపిస్తోంది.

గాజువాక మునిసిపల్ మాజీ చైర్మన్ వీవీఎన్ఎం రాజా హఠాన్మరణం



వీవీఎన్ఎం రాజా (ఫైల్)

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 23: గాజువాక మునిసిపల్ మాజీ చైర్మన్ వీవీఎన్ఎం రాజా (57) సోమవారం రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన యువజన కాంగ్రెస్ నాయకుడిగా, కార్పొరేటర్‌గా, గాజువాక మునిసిపాలిటీగా ఉన్నప్పుడు వైస్ చైర్మన్‌గా, చైర్మన్‌గా పనిచేశారు. 2004కు ముందు గాజువాక మునిసిపల్ చైర్మన్‌గా ఉన్న తిప్పల గురుమూర్తిరెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికకావడంతో, ఆ స్థానంలో రాజా ఎన్నికై ఏడాదిపాటు పనిచేశారు. అనంతరం గాజువాక మునిసిపాలిటీ జీవీఎంసీలో విలీనం అయ్యింది. రాజా కార్పొరేటర్‌గా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తరువాత కాంగ్రెస్ నుంచి టీజేపీలోకి మారిన రాజా 2014 అసెంబ్లీ ఎన్నికల సమయంలో వైసీపీలో చేరారు. గుండెకు సంబంధించిన సమస్య తలెత్తడంతో కొన్నేళ్ల క్రితం బైపాస్ సర్జరీ చేయించు కున్నారు. సోమవారం సాయంత్రం గుండెపోటు రావటంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన కూర్మన్నపాలెంలోని ఏప్లస్ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే రాజా మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఆయన భౌతికకాయాన్ని టోల్‌గేటు సమీపంలో గల శివాజీనగర్‌లోని స్వగృహానికి తరలించారు. రాజాకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాజా మృతికి పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ, వైసీపీ నాయకులు సంతాపం తెలిపారు.

కల్తీ నెయ్యి కారకులను కఠినంగా శిక్షించాలి

▸▸ హిందూ దేవాలయ పరిరక్షణ సమితి డిమాండ్



ఆర్డీవో కార్యాలయం ఎదుట హిందూ దేవాలయ పరిరక్షణ సమితి నిరసన

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 23: తిరుమల శ్రీవారి లడ్డూని అపవిత్రం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ హిందూ దేవాలయ పరిరక్షణ సమితి ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి కొణతాల అప్పలరాజు ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం స్వామి వారి లడ్డూ తయారీకి స్వచ్ఛమైన నెయ్యి కాకుండా జంతువుల కొవ్వు, నూనెలను ఉపయోగించిందని, ఈ విషయం తెలుసుకున్న భక్తులు తీవ్ర ఆవేదన చెందుతున్నారని అన్నారు. కల్తీ నెయ్యి వినియోగంపై కూటమి ప్రభుత్వం లోతుగా విచారణ జరిపి, సాక్ష్యాధారాలను బయటపెట్టి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం అధికారికి వినతిపత్రం అందజేశారు.

అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

- జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం
- ప్రజా ఫిర్యాదుల వ్యవస్థలో 401 వినతులు

తుమ్మపాల, సెప్టెంబరు 23: ఒకే సమస్యపై ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు ఫిర్యాదులు పునరావృతం కాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పలువురు ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ కార్యక్రమంలో అందుతున్న ఫిర్యాదులపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి శాశ్వత పరిష్కారాన్ని చూపించాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో 401 వినతులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ వై.శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయానికి 68 ఫిర్యాదులు

జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 68 ఫిర్యాదులు అందినట్టు జిల్లా ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలకు సంబంధించి అధిక ఫిర్యాదులు అందాయని, చట్ట పరిధిలో వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, ఎస్ఐ డి.వెంకన్న పాల్గొన్నారు.

కారిడార్ నిర్వాసితులకు గ్రీవెన్స్ సెల్



గ్రీవెన్స్ సెల్‌లో అర్జీలు ఇవ్వడానికి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన కారిడార్ నిర్వాసిత రైతులు

- రైతుల నుంచి అర్జీలు, ఫిర్యాదులు స్వీకరణ
- తొమ్మిది గ్రామాల నుంచి 532 మంది దరఖాస్తు



వినతులకు పరిశీలిస్తున్న ఆర్‌డీవో జయరాం

నక్కపల్లి, సెప్టెంబరు 23: విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం మండలంలో భూములు ఇచ్చిన రైతుల సమస్యలు తెలుసుకోవడానికి కలెక్టర్ ఆదేశాలతో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద స్పెషల్ గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. నర్సీపట్నం ఆర్డీవో జయరాం, తహసీల్దార్ అంబేద్కర్ నేతృత్వంలో నిర్వహించిన ఈ సెల్‌లో చందనాడ, మూలపర్ర, అమలాపురం, బుచ్చిరాజుపేట, రాజయ్యపేట, పాటిమీద, డీఎల్‌పురం, వేంపాడు, బోయపాడు గ్రామాలకు చెందిన నిర్వాసిత రైతులు నష్టపరిహారం, ప్యాకేజీ ఇతర సమస్యల గురించి వినతులు, ఫిర్యాదులు అందజేశారు. మొత్తం 532 ఫిర్యాదులు అందాయని తహసీల్దార్ చెప్పారు. అత్యధికంగా చందనాడ నుంచి 216 వినతులు, మూలపర్ర నుంచి 110 వినతులు అందాయి. కారిడార్ భూముల్లో సర్వేకు నిర్వాసిత రైతులు సహకరించాలని ఆర్డీవో జయరాం కోరారు.

జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిగా రామ్మోహన్‌రావు

అనకాపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిగా డాక్టర్ రామ్మోహన్‌రావు నియమితులయ్యారు. ఇప్పటి వరకు జిల్లా అధికారిగా పనిచేసిన బి.ప్రసాదరావు విశాఖపట్నం జిల్లాకు బదిలీ అయ్యారు.

బాణసంచా తయారీ, విక్రయాలకు అనుమతి తప్పనిసరి

▸▸ విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి

విశాఖపట్నం, సెప్టెంబరు 23 : దీపావళి పండుగ నేపథ్యంలో బాణసంచా పేలుళ్లు జరగకుండా ముందుస్తు చర్యలు చేపట్టాలని విశాఖ రేంజ్ పరిధిలోని అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పీలను డీఐజీ గోపీనాథ్ జెట్టి ఆదేశించారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకొని ఈ ఏడాది రేంజ్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. బాణసంచా నిల్వలు, తయారీ, విక్రయాలు జరిపే వారిపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయాలన్నారు. అనుమతి ఉన్న గోడౌన్లు, షాపులు వద్ద భద్రతా ప్రమాణాలు సరిగ్గా ఉన్నది లేనిది పరిశీలించాలన్నారు. అనధికారంగా వ్యాపారాలు చేసేవారిని గుర్తించి మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ వద్ద బైండోవర్ చేయాలని ఆదేశించారు.

టీచర్ తీరుపై ప్లస్ 2 బాలికల నిరసన

ఎలమంచిలి, సెప్టెంబరు 23: పట్టణంలోని బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఒక ఉపాధ్యాయురాలి తీరును నిరసిస్తూ ప్లస్ 2 (ఇంటర్) విద్యార్థినులు సోమవారం తరగతులు బహిష్కరించి పాఠశాల ఆవరణలో ఆందోళన చేశారు. పాఠాలు సరిగా చెప్పడంలేదని, సిలబస్ పూర్తి చేయకుండా పరీక్షలు నిర్వహిస్తున్నారని, అసభ్యకరంగా మాట్లాడుతున్నారని బాలికలు ఆరోపించారు. ఈ సమస్యను ఎస్ఎఫ్ఐ ప్రతినిధుల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోక పోవడంతో తరగతులు బహిష్కరించి నిరసన తెలిపామన్నారు. కాగా ఉన్నతాధికారులు విచారణ జరిపించి, సదరు ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.బాలాజీ డిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రతినిధి మణికంఠ, కేశవ, రవి, రాము లక్ష్మణ్, పావని, భవానీ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు మేలైన సేవలందించాలి

» జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ రామ్మోహనరావు



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రామ్మోహనరావు

తుమ్మపాల, సెప్టెంబరు 23 : పాడి రైతులకు మేలైన సేవలు అందించాలని జిల్లా పశు సంవర్థకశాఖ అధికారి డాక్టర్ బి.రామ్మోహనరావు సూచించారు. అనకాపల్లిలోని పశు సంవర్థక శాఖ జిల్లా కార్యాలయంలో సోమవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గాలికుంటువ్యాధి, చిన్నపారుడు వ్యాధి, బ్రూసిల్లా వ్యాధి తదితర వ్యాధుల నివారణకు పశువులకు టీకాలను విధిగా వేయాలన్నారు. పాడి రైతులకు కిసాన్ క్రెడిట్‌కార్డులు, బ్యాంకుల ద్వారా అందుతున్న రుణాలు తదితర అంశాల పై అవగాహన కల్పించాలన్నారు. పశు సంవర్థకశాఖ డివిజనల్ ఉప సంచాలకులు డాక్టర్ సీహెచ్.నర్సింహులు, డాక్టర్ చిట్టినాయుడు, డాక్టర్ పుష్ప, డాక్టర్ రాంబాబు, డాక్టర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

' ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు'



మాట్లాడుతున్న గణాంకాల అధికారిణి శశికళ

తుమ్మపాల, సెప్టెంబర్లు 23 : స్థానిక వనరుల వినియోగంతో వృద్ధిరేటు సాధించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని డిప్యూటీ గణాంకాల అధికారిణి ఎం.శశికళ అధికారులను ఆదేశించారు. రాబోయే ఐదేళ్లలో పట్టణ, మండలస్థాయిలో విజన్ ప్రణాళిపై సోమవారం అనకాపల్లి ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, ఉద్యాన, పంటలు, వెటర్నరీ, పాడి పరిశ్రమ, మత్స్య, స్త్రీశిశు సంక్షేమం, పరిశ్రమ, టూరిజం, సంక్షేమ హాస్టల్స్, తాగునీరులో తదితర రంగాల్లో సమన్వయంతో రానున్న ఐదేళ్లలో 15 శాతం వృద్ధిరేటు సాధించాలన్నారు. ఎంపీడీవో కేవీ నరసింహారావు, జీవీఎంసీ జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, పట్టణ, పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డాక్టర్, వెటర్నరీ డైరెక్టర్, సహాయ గణాంకాల అమలు, పర్యవేక్షణ ఇన్‌చార్జి అధికారి ఈకె శ్రీలక్ష్మి, శిశుసంక్షేమ శాఖ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సచివాలయ హెల్త్ సెక్రటరీలు ఆందోళన



వైద్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న హెల్త్ సెక్రటరీలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 23 : ప్రభుత్వ ప్రచార కార్యక్రమాల నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ సచివాలయ హెల్త్ సెక్రటరీలు సోమవారం సాయంత్రం ఎన్టీఆర్ వైద్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఏపీ యునైటెడ్ విలేజ్, వార్డు హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళ్ల దేవకి మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో ఏఎన్ఎం గ్రేడ్-3లను ఎమర్జెన్సీ వైద్య ఆరోగ్య సేవలకు మాత్రమే వినియోగించాలని, పనిఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఎంహెచ్‌వో బాలాజీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు శివకుమారి, దేముడమ్మ, విజయ, రేవతి, రమాదేవి, సీఐటీయూ నాయకులు ఆర్.శంకరరావు, వీవీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భారీ గోతులు.. వాహనదారుల పాట్లు

... 5వ పేజీ తరువాయి

సాయంత్రం లారీ కూరుకుపోగా, సోమవారం బొలేరో వ్యాన్ దిగబడిపోయింది. దీనిని బయటకు తీయడానికి మనుషులతో కుస్తీ పట్టినా ప్రయోజనం లేకపోవడంతో ట్రాక్టర్‌ను రప్పించి, తాళ్లతో బయటకు లాగాల్సి వచ్చింది. వద్దాది నుంచి రోలుగుంట వరకు లెక్కలేనన్ని గోతులు వున్నాయని, రోడ్డు విస్తరణ పనులు జరిగే వరకు కనీసం గోతులు అయినా పూడ్చాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తహసీల్దార్లకు మండలాలు కేటాయింపు

... 5వ పేజీ తరువాయి

ఏఓ.శ్రీనివాసరావును రాంబిల్లి తహసీల్దారుగా, రావికమతం నుంచి ఎస్.ఏ. మహేశ్వరరావును మునగపాకకు, నక్కపల్లి నుంచి అంబేద్కర్‌ను పరవాడకు, నర్సీపట్నం నుంచి బి.రవికుమార్‌ను సబ్బవరానికి, విశాఖపట్నం నుంచి ఎల్.రామారావును నర్సీపట్నానికి, బుచ్చెయ్యపేట నుంచి పి.శ్రీనివాసరావును గొలుగొండకు, ఏఎస్ఆర్ జిల్లా నుంచి వేణుగోపాల్‌ను నాతవరానికి, అనకాపల్లి కలెక్టరేట్ ల్యాండ్స్ సెక్షన్ ఆర్.నర్సింహమూర్తిని నక్కపల్లికి, కశింకోట నుంచి జి.సత్యనారాయణను పాయకరావుపేటకు, కె.కోటపాడు నుంచి జె.రమేశ్‌బాబును ఎస్.రాయవరానికి, చోడవరం నుంచి ఎల్.తిరుమలబాబును కోటవురట్లకు, చీడికాడ నుంచి బీవీ రాణిని కలెక్టరేట్ ఏఓగా నియమించారు. నాతవరం నుంచి ఎస్‌వీఎస్ నాయుడు కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్, మాడుగుల నుంచి పీవీ రత్నంను కలెక్టరేట్ ల్యాండ్స్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా, అడబాల శ్రీనివాసరావును కశింకోటకు, ఎ.రామారావును చోడవరం తహసీల్దారుగా నియమించారు.

36 మంది డీటీలు కూడా..

జిల్లాలో 36 మంది డిప్యూటీ తహసీల్దార్లకు బదిలీలు అయ్యాయి. ఐదేళ్లు ఒకేచోట పనిచేస్తున్న వారితోపాటు రిక్వెస్టు ట్రాన్స్‌ఫర్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి బదిలీలు జరిగాయి.

జడ్పీలో బదిలీలు

... 5వ పేజీ తరువాయి

నియమించారు. కొత్తగా వచ్చిన వి.అప్పారావుకు వి.మాడుగుల ఎంపీడీవోగా పోస్టింగ్ ఇచ్చారు. చింతపల్లి ఎంపీడీవో పి.ఆశాజ్యోతిని పాడేరు బదిలీ చేసి, ఆమె స్థానంలో కొత్తగా వచ్చిన ప్రేమ్‌సాగర్‌ను నియమించారు. పాడేరులో పనిచేస్తున్న కె.సాయినవీన్‌ను పొరుగు జిల్లాకు కేటాయించారు. జి.మాడుగుల ఎంపీడీవో లోహిత్‌సాగర్ మరో జిల్లాకు వెళ్లగా అతని స్థానంలో కొత్తగా వచ్చిన తేజ్‌రతన్‌ను నియమించారు. అలాగే హుకుంపేట ఎంపీడీవో ఆర్.వెంకటరావు పొరుగు జిల్లాకు వెళ్లగా అతని స్థానంలో కొత్తగా వచ్చిన టి.రమాదేవికి పోస్టింగ్ ఇచ్చారు. ముంచంగిపుట్టు ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ ఇతర జిల్లాకు వెళ్లగా ఆయన స్థానంలో కొత్తగా వచ్చిన ఎం.శ్రీసాయిహర్షను, పెదబయలు ఎంపీడీవో విగిన్ బక్కా ఇతర జిల్లాకు బదిలీ కాగా ఆయన స్థానంలో కొత్తగా వచ్చిన కేవీ ప్రసాద్‌ను నియమించారు. కాగా పద్మనాభం (విజయకుమార్), అనకాపల్లి (కేవీ నరసింహరావు), కశింకోట (వీవీ రవికుమార్), కోటవురట్ల (జి.కాశీవిశ్వనాథరావు), రావికమతం (వెంకన్నబాబు), డుంబ్రిగుడ (ఎం.ఉషారాణి), గూడెంకొత్తవీధి (వై.ఉమామహేశ్వరరావు) ఎంపీడీవోలను అక్కడే కొనసాగించారు. అనంతగిరి ఎంపీడీవో స్టడీ లీవ్‌లో ఉండగా అక్కడ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మాకవరపాలెం, పెందుర్తిలో ఇంకా ఎవరినీ నియమించలేదు.



రాంబిల్లి : మూలజంపలో జరిగిన సభలో ఎమ్మెల్యే సుందరపు, పగడ



పరవాడ : పెదముషిడివాడ సభలో ఎమ్మెల్యే పంచకర్ల, గండి బాబ్జి

మెజార్టీ ఇచ్చిన ప్రజలు మెచ్చేలా పాలన

'ఇది మంచి ప్రభుత్వం' సభల్లో ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయకుమార్, పంచకర్ల రమేష్‌బాబు



అనకాపల్లి మండలం దిబ్బపాలెం సభలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కొణతాల, పీలా, బుద్ద తదితరులు

తుమ్మపాల, సెప్టెంబరు 23 : రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. సోమవారం అనకాపల్లి మండలం దిబ్బపాలెంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడారు. నియోజకవర్గంలో రూ.20 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మెజార్టీ ఇచ్చి గెలిపించిన ప్రజలు మెచ్చుకునేలా పాలన సాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాంబిల్లి : రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి పాలన సాగుతుందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. మూలజంప గ్రామంలో సోమవారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిందని ఆరోపించారు. తహసీల్దార్ పి.భాగ్యవతి, టీడీపీ రాష్ట్రకార్యదర్శి ధూళి రంగనాయకులు, టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర, ఎంపీటీసీ అల్లవరపు బాబ్జి, మండల తెలుగు యువత అధ్యక్షులు ఎరిపల్లి అజయ్, మాజీ సర్పంచ్ వేగి రాము తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సూచించారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పెదముషిడివాడలో సోమవారం పర్యటించి మాట్లాడారు. రాష్ట్రం సంక్షోభంలో ఉన్నప్పటికీ సంక్షేమ పాలన అందిస్తున్నామన్నారు. పెందుర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జి మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా కూటమి పాలన సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హేమసుందరరావు, సర్పంచ్ పల్లా నాగమణి, ఎంపీటీసీ ఒమ్మి వెంకటరావు, నాయకులు కరణం నరసింగరావు, బలిరెడ్డి అప్పారావు, పంచాయతీ కార్యదర్శి శైలజా, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కొత్తూరు : అనకాపల్లి మండలం సుందరయ్యపేట పంచాయతీ అచ్చెయ్యపేటలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు రేఖా రమణమూర్తి, చందక నర్సింగ్ యాదవ్ ఆధ్వర్యంలో కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి వందరోజుల ప్రగతిని వివరించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీరాములు, ఉరిగిటి శివ సూర్యనారాయణ, పల్లా అబ్బాయినాయుడు, మహాలక్ష్మి, నాగశ్రీనివాస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని సబ్బవరం, గోపాల్‌నగర్, సాయినగర్ తదితర గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి వందరోజుల పాలనలో ప్రగతిని వివరించారు. నాయకులు పల్ల తాతారావు, కోరాడ శ్రీను, టి.శేఖర్, బర్ల రమణ, గొర్లి కుమార్, కార్యదర్శి మూర్తిబాబు, అక్కుబాబు, చింతల శ్రీను, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పట్టణంలో కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి వంద రోజుల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, ఈవోపీఆర్డీ వైవీ సత్యనారాయణ, పంచాయతీ ఈవో వర్మతోపాటు టీడీపీ నాయకులు యాళ్ళ వరహాలబాబు, గూటూరు శ్రీనివాసరావు, చింతకాయల రాంబాబు, జూరెడ్డి ప్రసాద్, వేములపూడి అప్పారావు, దువ్వి శ్రీను, జనసేన నాయకులు ఆచంట దొర తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న లడ్డూ ప్రసాదం అపవిత్రంపై భక్తుల పూజలు



'పేట' పాండురంగ ఆలయంలో పూజలు నిర్వహించిన బుజ్జి తదితరులు

పరవాడ, సెప్టెంబరు 23 : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేపడుతున్న ప్రాయశ్చిత్త దీక్షకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సోమవారం ఇక్కడ సంఘీభావం తెలియజేశారు. పరవాడ సినిమాహాల్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన సంఘీభావ దీక్షలో మాట్లాడారు. తిరుమల పవిత్రను అపవిత్రం చేసిన జగన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, కరుణాకరరెడ్డి, ధర్మారెడ్డిలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, పరవాడ సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, కూటమి నాయకులు చింతకాయల ముత్యాలు, బుగిడి రామగోవిందరావు, గొర్లి రామునాయుడు, పైలా రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా ఇక్కడి పాండురంగస్వామి ఆలయంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పూజలు నిర్వహించారు. నాయకులు గెడ్డం చైతన్య, ఎగదాసు నానాజీ, ఆచంట దొర, పల్లి దుర్గారావు, జగ్గన్నదొర, నారపురెడ్డి పద్మ, నాగమల్లి తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి : తిరుపతి లడ్డూ తయారీలో జరిగిన అపచారాన్ని దృష్టిలో ఉంచుకుని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు జనసేన నాయకులు ఇక్కడ సంఘీభావం ప్రకటించారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్, జిల్లా కార్యదర్శి ఆకేటి గోవిందరావు, నాయకులు కురందాసు అప్పలరాజు, పిక్కిస్వామి, పాము గణేశ్, యలమంచిలి చంద్రరావు తదితరులు ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు.

కొత్తూరు : అనకాపల్లి రింగురోడ్డులోని జనసేన కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు ప్రాయశ్చిత్త దీక్షను ప్రారంభించారు. మూడు రోజుల పాటు ఈ దీక్షలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ చేయనున్నారు. ఈ సందర్భంగా కూటమి నేతలు నల్ల రిబ్బన్లతో నిరసన వ్యక్తం చేశారు.

కోటవురట్ల : పవన్ కల్యాణ్ దీక్షకు మద్దతుగా జనసేన మండల శాఖ అధ్యక్షుడు సింగంపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండలంలోని సుంకపూర్‌లో గల దేవాలయంలో పూజలు నిర్వహించారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీపై మండలంలోని అడ్డరోడ్డు తిమ్మాపురంలో పలువురు హిందువులు రామాలయం నుంచి ఆంజనేయస్వామి వారి ఆలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ, జనసేన జిల్లా నాయకులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, తోట నగేశ్, రవిరాజు మాట్లాడుతూ భక్తులు ఎంతో పవిత్రంగా భావించే లడ్డూలో కల్తీనెయ్యి వాడడం దారుణమన్నారు. వెంటనే బాధ్యులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగం రమేష్, ఎస్.సూర్యారావు, జోగినాయుడు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో దీక్షకు ఎమ్మెల్యే సన్నాహాలు

ఎలమంచిలి : పవిత్ర తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేపట్టిన దీక్షకు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సంపూర్ణ మద్దతు తెలిపారు. సోమవారం ఇక్కడ విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇందుకు సంఘీభావంగా అచ్యుతాపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్ర, శని, ఆదివారాలు మూడు రోజుల పాటు తాను దీక్షలో చేపడతానన్నారు. సుమారు 30 వేల మంది ప్రజలు పాల్గొనేలా ఏర్పాట్లు చేపడుతున్నట్టు చెప్పారు. నియోజకవర్గ ప్రజలంతా పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులతో పాటు పురోహితులు పాల్గొన్నారు.



ఉపమాక వెంకన్న ఆలయంలో జనసేన నేత శివదత్, తదితరుల పూజలు

పెదపల్లి రైల్వే గేటు సమస్య పరిష్కారానికి సన్నాహాలు

» వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలన » ప్రతిపాదనలకు సూచనలు

ఎలమంచిలి, సెప్టెంబరు 23 : పట్టణంలోని పెదపల్లి రైల్వేగేటు ప్రాంతాన్ని రైల్వే శాఖ అధికారులు, ఆర్అండ్‌బీ డీఈ, పట్టణ ప్రణాళికా విభాగం అధికారులతో కలిసి ఎమ్మెల్యే విజయ్‌కుమార్ సోమవారం పరిశీలించారు. ఈ గేటు కారణంగా మునిసిపాలిటీకి వచ్చే ఏడుగ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం ఇబ్బందులకు గురవుతున్న విషయాన్ని ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో ఆయన ఇక్కడికి విచ్చేసిఈ రైల్వే గేటు సమీపంలో అండర్ బ్రిడ్జిని ఏర్పాటు చేస్తే బాగుంటుందా లేక ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్న అంశంపై అధికారులతో చర్చించారు. సమస్య పరిష్కారానికి ప్రతిపాదనలను రూపొందించాలని సూచించారు. కమిషనర్ ప్రసాదరాజు, టీపీవో శ్రీలక్ష్మి, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను, నాయకులు పిట్టా శ్రీను, కొఠారు శ్రీను, నరేష్, గుర్రాల శేఖర్, ఖన్నాసాహెబ్, పల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, పట్టణంలోని కొమ్మాయి గుండం వద్ద రెండో తేదీన ప్రారంభించనున్న అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు.

'సుందరంగా అచ్యుతాపురం జంక్షన్'

అచ్యుతాపురం : పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురం జంక్షన్‌ను తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే విజయకుమార్ అన్నారు. జంక్షన్ విస్తరణ పనులు పరిశీలించి మాట్లాడారు. ముందుగా పరవాడ నుంచి అచ్యుతాపురం వరకు రెండు వందల అడుగుల రోడ్డు విస్తరణ పనులు జరుగుతాయన్నారు. అనంతరం అచ్యుతాపురం- గాజువాక ప్రధాన రహదారిలో అప్పన్నపాలెం నుంచి అచ్యుతాపురం-పూడిమడక రోడ్డులో గల సెజ్ ముఖద్వారం వరకు వందుగుల రోడ్డు ఏర్పాటు చేస్తామన్నారు. నాయకులు జనపరెడ్డి శ్రీనివాసరావు, బైలపూడి శ్రీరామదాసు, ద్వారపురెడ్డి బాపూజీ పాల్గొన్నారు.

డ్రైవర్లకు సీఐ కౌన్సెలింగ్

పరవాడ, సెప్టెంబరు 23 : ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు డ్రైవర్లకు సూచించారు. 'అనధికార పార్కింగ్‌తో తరచూ ప్రమాదాలు' శీర్షికతో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన వెనువెంటనే స్పందించారు. ఈ మేరకు ఇక్కడి మండల పరిషత్ జంక్షన్ వద్ద డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. వాహనాలను రహదారిపై ఎక్కడపడితే అక్కడ నిలపరాదన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. అలాగే, సింహాద్రి, రాంకీ ఎస్ఈజెడ్, లంకెలపాలెం తదితర ప్రాంతాల్లోని డ్రైవర్లకు కూడా ట్రాఫిక్ నిబంధనల పై అవగాహన కల్పించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

'చేపల వేట నిషేధ భృతి చెల్లించాలి'

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 23 : చేపల వేట నిషేధ కాలంలో జిల్లాలోని మత్స్యకారులకు జీవనభృతి నిమిత్తం ఇవ్వాల్సిన పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ప్రభుత్వాన్ని సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వాస్తవానికి నిషేధ రోజుల్లోనే పరిహారం చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాల్సిందిగా కోరారు.

'స్వర్ణాంధ్ర సాధనే అందరి లక్ష్యం కావాలి'

నక్కపల్లి, సెప్టెంబరు 23: ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్వర్ణాంధ్ర పోస్టర్లను ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో సీతారామరాజు, ఈవోఆర్డీ బి.సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐదేళ్లలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను కార్యదర్శులకు ఎంపీడీవో వివరించారు. స్వర్ణాంధ్ర ఆసాధనే అందరి లక్ష్యం కావాలన్నారు. కార్యదర్శులు అప్పలరాజు, నర్సింగరావు, సత్యనారాయణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు



కార్మికుల ఆరోగ్య వివరాలు నమోదు చేస్తున్న వైద్యులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 23 : ఇక్కడి ఎన్టీఆర్ వైద్యాలయం ఎదుట స్వచ్ఛత హీ సేవ, సఫాయి మిత్ర సురక్ష కార్యక్రమంలో భాగంగా సోమవారం పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పట్టణానికి చెందిన పారిశుధ్య కార్మికులు 108 మంది హాజరై వైద్యసేవలు పొందినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమా శిబిరాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు.

పట్టణ ఎస్ఐగా ఈశ్వరరావు బాధ్యతలు



అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 23 : పట్టణ ఎస్ఐగా దాసరి ఈశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బుచ్చెయ్యపేట ఎస్ఐగా పనిచేస్తున్న ఈయన రెండు రోజుల క్రితం జరిగిన బదిలీల్లో భాగంగా అనకాపల్లి పోలీస్ స్టేషన్‌కు నియమితులయ్యారు.

గొడిచెర్ల పాఠశాలలో సంజ్ఞా భాషా దినోత్సం

నక్కపల్లి, సెప్టెంబరు 23: గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రత్యేక ఉపాధ్యాయురాలు షేక్ యాస్మిన్ ఆధ్వర్యంలో ప్రపంచ సంజ్ఞ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. దివ్యాంగులు, ఇతర వైకల్యం గల వారంతా అన్ని విషయాలు తెలుసుకోవాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏటా నిర్వహిస్తున్నట్టు ఆమె చెప్పారు. హెచ్ఎం అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

తుమ్మపాల, సెప్టెంబరు 23 : ఇక్కడి మధురానగర్ 14, 15 వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి సోమవారం సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు శంకుస్థాపన చేశారు. సరైన రహదారులు లేక స్థానికులు ఇబ్బందులు పడుతుండడంతో ఈ చర్యలు చేపట్టామన్నారు. విల్లూరి చంద్రశేఖర్, కర్రి బాబి, కన్నారావు, నాగేశ్వరరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

దసరా శూలాల మహోత్సవ కమిటీ ఎన్నిక

అచ్యుతాపురం రూరల్, సెప్టెంబరు 23 : దసరా పండగను పురస్కరించుకొని తిమ్మరాజుపేటలో జగ్గారావు మిత్రమండలి ఆధ్వర్యంలో అక్టోబరు పదో తేదీన జరగనున్న శూలాల మహోత్సవానికి సోమవారం కమిటీని నియమించారు. ఛైర్మన్‌గా షేక్ మీరుబాబు, వైస్ ఛైర్మన్‌గా రాపేటి గౌతమ్, కోశాధికారిగా మళ్ళ వరప్రసాద్, కమిటీ సభ్యులుగా శరగడం జోగినాయుడు, భీమిశెట్టి గంగాధర్, శిలపరశెట్టి సత్యనారాయణ, పోలార్పు గంగరాజు, వంగా రాము, కాకి జగదీష్, రేవడి నూకనాగేశ్వరరావులను ఎన్నుకున్నారు.

సిద్ధి వినాయకుడ్ని దర్శించుకున్న అదీప్‌రాజ్

సబ్బవరం, సెప్టెంబరు 23 : పైడివాడ గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సోమవారం దర్శించుకున్నారు. స్వామికి పూజల అనంతరం అన్నసమారాధనను ప్రారంభించారు. సర్పంచ్ వడ్డాది అప్పలరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబు, సీనియర్ నాయకులు కోటనా రాము తదితరులతో పాటు పలువురు యువకులుపాల్గొన్నారు.

ఆరిపాకలో ముగిసిన మండల స్థాయి పోటీలు

సబ్బవరం, సెప్టెంబరు 23 : మండలంలోని ఆరిపాక జడ్పీ హైస్కూల్‌లో బాలికల క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. తొలుత ఈ పోటీలను ఎస్ఎంసీ ఛైర్మన్ మల్ల యోగి ప్రారంభించారు. అనంతరం అండర్-14, 17 విభాగాల్లో విద్యార్థినులు ఉత్సాహంగా తలపడ్డారు. ప్రతిభ చూపిన వారిని నియోజకవర్గస్థాయి ఆటల పోటీలకు ఎంపిక చేశారు. విజేతలను హెచ్ఎం మల్లేశ్వ రరావు, పీడీలు అబ్దుల్ రెహ్మాన్, చందన్‌వర్మ తదితరులు అభినందించారు.

రాంబిల్లి : ఇక్కడి ఉన్నత పాఠశాలలో సోమవారం మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. జడ్పీటీసీ సభ్యుడు ధూళి నాగరాజు ప్రారంభించారు. విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలన్నారు. జనసేన మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర, వైసీపీ మండల మాజీ కన్వీనర్ జి.శ్రీనుబాబు, పాఠశాల హెచ్ఎం ఎం.వేణుగోపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బది'లీలలు'

... 5వ పేజీ తరువాయి

పోస్టింగులు ఇవ్వడం వెనుక అనకాపల్లి, విశాఖపట్నం సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ విభాగంలో ఇద్దరు కీలక ఉద్యోగుల పాత్ర ఉన్నట్టు చెబుతున్నారు.

వాణిజ్య పన్నుల విభాగంలో...

వాణిజ్య పన్నుల శాఖ విశాఖ సర్కిల్ కార్యాలయం పరిధిలో అడ్డగోలుగా బదిలీలు జరిగాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి ఈ శాఖలో 45 మందికిపైగా ఏసీటీఓలు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్‌లకు ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో బదిలీలు చేస్తూ ఈ నెల 21వ తేదీన విశాఖపట్నం జాయింట్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం సాయంత్రానికి ఆ ఉత్తర్వుల్లో మార్పులు చేశారు. కొంతమంది ఉద్యోగులు పైరవీలు చేసుకొని తమకు కావాల్సిన చోటుకు బదిలీ చేయించుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో స్పౌజ్ కోటా వినియోగించుకున్నవారికి, గతంలో అవే కార్యాలయాల్లో పనిచేసిన వారికి నిబంధనలకు విరుద్ధంగా అక్కడే పోస్టింగ్‌లు ఇస్తూ బదిలీలు చేశారు. దీనిపై వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగ సంఘాల నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని ఆందోళనలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 23 : కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష కార్మిక, రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక పీటీడీ కాంప్లెక్స్ వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆర్.దొరబాబులు మాట్లాడుతూ ఈ కార్మిక చట్టాలు కార్మికులకు, ప్రజలకు హాని చేసే విధంగా ఉన్నాయన్నారు. మోదీ ప్రభుత్వం ఎనిమిది గంటల పని దినానికి తూట్లు పొడిచి 12 గంటల విధానం తీసుకురావడం విచారకరమన్నారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రెడ్డిపల్లి అప్పలరాజు, కర్రి అప్పారావు, సీఐటీయూ నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, వీవీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కశింకోటలో అంగన్‌వాడీ సిబ్బంది, ముఠా కార్మికులు, పంచాయతీ పారిశుధ్య కార్మికులు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ తదితర సంఘాల కార్మికులు సోమవారం ఇక్కడ ఆందోళన చేపట్టారు. సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. వెంటనే కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎం.నారాయణమ్మ, బి.సత్యవతి, గంప దొరబాబు, పి.అప్పారావు, జి.లోవరాజు, కె.సత్తిబాబు, సూరిబాబు, పోతురాజు, సూరిబాబు, అప్పారావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : కార్మిక వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం విడనాడాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అచ్యుతాపురం జంక్షన్‌లో సోమవారం బ్లాక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రం తీరును దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.సోమునాయుడు, పైడిరాజు, వసంత, రమణ, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.



అనకాపల్లి పీటీడీ కాంప్లెక్స్ వద్ద వివిధ సంఘాల ప్రతినిధుల నిరసన

రాంబిల్లి : మండల కేంద్రం రాంబిల్లిలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన చేపట్టారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు మాట్లాడుతూ కార్మికులకు నష్టం చేసే నాలుగు కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎం.నారాయణరావు, కాశియ్య, వై.రాము, నేవీ నిర్మాణ కార్మికులు, ముఠా, కొబ్బరి ఒలుపు కార్మికులు పాల్గొన్నారు.

పరవాడ : కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్టీపీసీ మెయిన్‌గేటు వద్ద సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కార్మికుల హక్కులను పరిరక్షించాలని, నాలుగు లేబరు కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు పి.గోవిందరాజు, వెంకటరావు, పీడీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'క్రీడలతో శారీరక, మానసిక వికాసం'



వడ్డాదిలో ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 23 : క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదం చేస్తాయని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు అన్నారు. సోమవారం వడ్డాది కేఏడీ జడ్పీ హైస్కూల్ మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, క్రీడా నైపుణ్యాలను వెలికి తీసి జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనేలా క్రీడాకారులను తయారు చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, కూటమి నాయకులు దొండా నరేష్, గోకివాడ కోటేశ్వరరావు, కోవెల వెంకటరమణ, తమరాన దాసు, దేవర అప్పారావు, దొండా సన్యాసి రావు, హెచ్ఎం శేషుబాబు, పీఈటీ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌కు మద్దతుగా జనసేన నేతల దీక్షలు



వేంకటేశ్వరస్వామి ఆలయంలో జనసేన నాయకులు, కార్యకర్తల దీక్షలు

నర్సీపట్నం అర్బన్, సెప్టెంబరు 23: తిరుపతి లడ్డు విషయమై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో జనసేన ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర ఆధ్వర్యంలో నాయకులు సోమవారం దీక్షలు చేపట్టారు. సూర్యచంద్ర మాట్లాడుతూ హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా తిరుమల ప్రసాదాన్ని అపవిత్రం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

స్పీకర్‌ను మర్యాదపూర్వంగా కలిసిన ఆర్టీవో రమేశ్



స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి పుష్పగుచ్ఛం ఇస్తున్న నర్సీపట్నం ఆర్టీవో రమేశ్

నర్సీపట్నం, సెప్టెంబరు 23 : నర్సీపట్నం రీజనల్ ట్రాన్స్‌పోర్టు అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎన్. రమేశ్ సభాపతి అయ్యన్నపాత్రుడుని సోమవారం మర్యాద పూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై స్పీకర్ పలు సూచనలు చేశారు. రోడ్డు భద్రత, వాహనాలకు లైసెన్స్, రిజిస్ట్రేషన్, బీమా తదితర రికార్డులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని స్పీకర్ సూచించారు. ర్యాష్ డ్రైవింగ్ వలన కలిగే ఇబ్బందులపై యువతకు అవగాహన కల్పించాలన్నారు. రికార్డులు లేని వాహనాలు గుర్తించి చర్యలు తీసుకోవాలని స్పీకర్ అన్నారు.

'టీచర్ల సమస్యల పరిష్కారానికి ఏపీటీఎఫ్ కృషి'

రోలుగుంట, సెప్టెంబరు 23 : ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏపీటీఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.వెంకటపతి రాజు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అన్ని హైస్కూళ్లలో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో నాయకులను కలిసి ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు డి.నూకరాజు, జిల్లా కార్యదర్శి ఆర్‌వీఎస్ఆర్ శర్మ, మండల అధ్యక్షులు పి.రమణ, ప్రధాన కార్యదర్శి బోనెల రాము, ప్రధాన సలహాదారుడు అశోక్‌సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ హాస్టల్ సీట్లకు దరఖాస్తు చేసుకోవాలి

▸▸ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్. రాజు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 23: కేజీబీవీ హాస్టల్ సీట్ల కోసం విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్. రాజు కోరారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వడ్డాదికి మంజూరైన కేజీబీవీ హాస్టల్ ప్రొసీడింగ్ కాపీని ఎంఈవోలు బొజ్జబాబు, కాశీవిశ్వేశ్వరావులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వడ్డాది, కె.నాయుడుపాలెంల్లో హాస్టళ్ల భవన నిర్మాణాలు పూర్తయినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఐదేళ్లుగా విద్యార్థినులు నష్టపోవలసి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యార్థినులకు హాస్టల్ సదుపాయం కల్పించిందన్నారు. ఆయా గ్రామాల్లోని హైస్కూళ్లు, కళాశాల్లో 9,10, ఇంటర్ విద్యాభ్యాసాలు చేస్తున్న స్థానికేతర విద్యార్థినులు హాస్టల్ ప్రవేశాలకు ఎంఈఓ కార్యాలయాల్లో దరఖాస్తులు ఈనెలాఖరులోగా చేసుకోవాలని ఎమ్మెల్యే రాజు కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగేశ్వరిదేవి, హెచ్ఎం శేషుబాబు పాల్గొన్నారు.

మండలంలో మోస్తరు వర్షం



ఘాట్‌రోడ్డులో కురుస్తున్న వర్షం

మాడుగుల రూరల్, సెప్టెంబరు 23 : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం మోస్తరు వర్షం పడింది. ఉదయం నుంచి వాతావరణం పొడిగానే ఉంది. మధ్యాహ్నం మూడు గంటలకు ఆకాశం మేఘావృతమై చిరుజల్లులతో ఆరంభమై మోస్తరు వర్షం పడింది. ఈ వర్షం వరి పంటకు మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

దేవరాపల్లికి డిగ్రీ కళాశాల మంజూరు చేయాలి

దేవరాపల్లి, సెప్టెంబరు 23: మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు కేవీరమణతో కూడిన సభ్యులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. డిగ్రీ కళాశాల లేకపోవడంతో ఇంటర్, పదవ తరగతితో చదువులకు స్వస్తి పలుకుతున్నారని, ప్రధానంగా ఆడ పిల్లల చదువులు ఆగిపోతున్నాయన్నారు. దేవరాపల్లిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే దేవరాపల్లి, అనంతగిరి, వేపాడ మండలాల విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆయన వెంట కె.శ్రీను, సంతోష్ తదితరులు ఉన్నారు.

త్రోబాల్ పోటీల్లో గునుపూడి విద్యార్థుల ప్రతిభ



త్రోబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

నాతవరం, సెప్టెంబరు 23 : మండలంలోని గునుపూడి హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈనెల 21, 22వ తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన పోటీల్లో గునుపూడి హైస్కూల్ విద్యార్థులు లగుడు అరవింద్, మత్సుర్తి భార్గవ్ ధనుష్ త్రోబాల్ పోటీలలో తృతీయస్థానం సాధించారు. వీరిని సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి. శివజ్యోతి, ఎస్ఎంసీ చైర్మన్ ఎన్. సత్యవతి, వ్యాయామ ఉపాధ్యాయుడు నాయుడు, ఉపాధ్యాయుడు ఎస్. సత్యారావు, సీఆర్‌పీ వి.నాగేశ్వర రావు అభినందించారు.

ఎన్నికల హామీల అమలుకు చంద్రబాబు సిద్ధం

▸▸ నియోజకవర్గంలో రెండు పరిశ్రమలు ఏర్పాటుకు సీఎం హామీ ▸▸ మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



చీడికాడ: ఎమ్మెల్యే బండారు, కూటమి నాయకులను సన్మానిస్తున్న కార్యకర్తలు



బుచ్చెయ్యపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

చీడికాడ, సెప్టెంబరు 23: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అంచెలంచెలుగా అమలు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సిద్ధంగా ఉన్నారని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా దండిసురవరం, దిబ్బపాలెం, బైలపూడి గ్రామాల్లో సోమవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో చంద్రబాబు సీఎం అయిన వెంటనే పింఛన్‌లు పెంచి ప్రతి నెల అందిస్తున్నామన్నారు. దీపావళి నుంచి ఉచితంగా గ్యాస్ సిలిండర్లు పంపిణీకి నిర్ణయం తీసుకోగా, నిరుద్యోగులకు డీఎస్సీ, ఉచిత ఇసుక వంటివి అమలు చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో రెండు పరిశ్రమలు ఏర్పాటుకు చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. దీనిలో కె.కోటపాడు మండలంలో ఒకటి, చీడికాడ మండలంలో ఒక పరిశ్రమ ఏర్పాటుకు నిర్ణయించామన్నారు. అలాగే కె.కోటపాడు మీదుగా దేవరాపల్లి మండలం వాకపల్లి వరకూ డబుల్‌రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషిచేస్తానన్నారు. వరహాపురం- వీఆర్ఆర్.పేట, వీఆర్ఆర్‌పేట- కోనాం, దిబ్బపాలెం-దండిసురవరం రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయిస్తానన్నారు. తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉన్న దిబ్బపాలెం పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని బండారు హామీ ఇచ్చారు. మూడు గ్రామాల్లో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, కూటమి నాయకులకు పూలమాలలు, హారతులతో మహిళలు ఘనస్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు పైలా ప్రసాదరావు, మేడపురెడ్డి శ్రీనివాస్, రాయపురెడ్డి కృష్ణ, గౌరీపట్టపు నానాజీ, దారపు పెద్దినాయుడు, గండి మునలినాయుడు, ఎర్రా అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో..

కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తోందని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు అన్నారు. సోమవారం ఇక్కడ జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం వంద రోజుల్లో చేసిన కార్యక్రమాలను వివరించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వంద రోజుల్లో నెలకు రూ.4 వేలు పెన్షన్, దివ్యాంగులకు రూ.6వేలు అందిస్తున్నామన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు మాట్లాడుతూ, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేసి ప్రజల ఆస్తుల భద్రత కల్పించామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు వీఎస్ఎన్.మూర్తి యాదవ్, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరీదేవి, నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్.రాజు, కూటమి నాయకులు కోరుకొండ రవికుమార్, ముచ్చకర్ల తాతయ్యబాబు, సుంకర లక్ష్మి, ఎంవీవీ. సత్యనారాయణ, దొంకిన అప్పలనాయుడు, తమరాన సింహాద్రప్పన్న, గొన్నాబత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్‌లో..

మండలంలోని పొంగలిపాక, వమ్మలి, ముకుందపురం పలు గ్రామాల్లో సోమవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో చేపట్టిన పనులను ప్రజలకు వివరించారు. కరపత్రాలు పంచి పెట్టి, ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లు గోడలకు అతికించారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు, ఎంపీటీసీ సభ్యుడు షెచర్ల సన్యాసిరావు, టీడీపీ నాయకులు నాయని సత్యనారాయణ, వమ్మలి సర్పంచ్ సింహాచలం నాయుడు, నందారపు సన్యాసిరావు, మాలిబాబు జనసైనికులు దయా యాదవ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోలుగుంటలో..

ప్రజలు మెచ్చేలా కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలన ఉందని జె.నాయుడుపాలెం గ్రామ టీడీపీ నాయకుడు కిల్లాడ నాయుడు, బోడాపాత్రుని నరేష్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని జె.నాయుడుపాలెంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వంద రోజుల్లో సాధించిన విజయాలను ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మాడుగుల రూరల్: పొంగలిపాకలో స్టిక్కర్లు అతికిస్తున్న కూటమి నాయకులు



రోలుగుంట: జె.నాయుడుపాలెంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

మార్కెట్‌ను మునిసిపాలిటీలో విలీనం చేయండి



గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేస్తున్న శివనారాయణరాజు

నర్సీపట్నం, సెప్టెంబరు 23 : ఇందిరా మార్కెట్‌ని మునిసిపాలిటీలో విలీనం చేయాలని సామాజిక, ఆర్థిక వెనకబడిన తరగతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె. శివనారాయణరాజు సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలన అధికారి సూర్యనారాయణకు సోమవారం వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా మార్కెట్‌లో పారిశుధ్య పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. మండల పరిషత్, మునిసిపల్ అధికారులు మధ్య సమన్వయ లోపం కారణంగా సమస్య పరిష్కారం కావడం లేదని తెలిపారు. దుకాణాల కేటాయింపుల్లో జరిగిన అవకతవకలపై గతంలో లోకాయుక్తలో కేసు వేయడం జరిగిందని తెలిపారు. లోకాయుక్త ఆదేశాలు అమలు పరిచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మునిసిపాలిటీ పరిధిలో ఉన్న ఇందిరా మార్కెట్‌ని మండల పరిషత్ నుంచి మునిసిపాలిటీలో విలీనం చేయాలని కోరారు.

వర్మీ కంపోస్ట్ ద్వారా పంచాయతీలకు ఆదాయం



కె.కోటపాడు: ఏ.కోడూరులో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో అప్పలరాజు

కె.కోటపాడు, సెప్టెంబరు 23: సంపద కేంద్రాల్లో వర్మీ కంపోస్టు తయారీ ద్వారా పంచాయతీలకు ఆదాయం ఉంటుందని ఎంపీడీవో ఎస్.అప్పలరాజు అన్నారు. సోమవారం మండలంలోని ఏ.కోడూరులో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన వీధుల్లో ఉన్న చెత్త కుప్పలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. అనంతరం సంపద కేంద్రాలను తనిఖీ చేసి తడి, పొడి చెత్తలను వేరు చేయాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. పంచాయతీ విస్తరణ అధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

చీడికాడలో..

చెత్త నుంచి సంపద తయారీకి వానపాములు ఎంతో అవసరమని ఈవోపీఆర్‌డీ ఎం.కామేశ్వరరావు అన్నారు. మండలంలోని చీడికాడ, మంచాల, కోనాం, అప్పలరాజుపురం గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలోని వర్మీకంపోస్టు పిట్‌లలో 15 కిలోలు చొప్పున వానపాములను సోమవారం అధికారులు విడిచిపెట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సన్యాసిరావు, రాజేంద్రప్రసాద్, నాయకులు గాలి బాలకృష్ణ, పెద్దింటి ఎర్రునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో..

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీఓ చంద్రశేఖరు అన్నారు. ఎం.అమండ, మామిడిపల్లి గ్రామాల్లో స్వచ్ఛ హీ సేవా కార్యక్రమం చేపట్టారు. వర్షాలు పడుతుండడంతో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సంపద కేంద్రాలను పరిశీలించి, మంచి ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పోతల పాత్రునాయుడు, లెక్కల సత్యనారాయణ, కార్యదర్శులు అప్పలనాయుడు, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నాణ్యత నమూనాల సేకరణ



ఆరిలోవలో రోడ్డు నాణ్యత శాంపిల్స్ సేకరిస్తున్న విజిలెన్స్ అధికారులు

గొలుగొండ, సెప్టెంబరు 23: మండలంలోని ఆరిలోవ అటవీ ప్రాంతంలో నిర్మించిన రోడ్డు శాంపిల్స్‌ను విజిలెన్స్ అధికారులు సోమవారం సేకరించారు. కృష్ణాదేవిపేట-నర్సీపట్నం మార్గంలో ఎర్రవరం రాజులబాబు గుడి నుంచి పప్పుశెట్టిపాలెం మధ్యలో గత ప్రభుత్వ హయాంలో రూ.4 కోట్లతో మూడున్నర కిలోమీటర్లు తారు రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. 2024 ఎన్నికల ముందు ఆదరాబాదరాగా రోడ్డు నిర్మాణం చేపట్టారు. అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఈ రోడ్డును పరిశీలించి, నాణ్యత లేకుండా నిర్మించారని, దీనిపై క్షేత్రస్థాయి నివేదిక ఇవ్వాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. దీనిపై విజిలెన్స్ ఎస్పీ స్నేహిత, విజిలెన్స్ డీఈ శ్రీహరిబాబు, జేఈ రామ్‌గోపాల్, పీఆర్ క్వాలిటీ డీఈ రుత్తల పాత్రుడు, జేఈ ప్రసాద్, పీఆర్‌జేఈ టీకేవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో రోడ్డు శాంపిల్స్‌ను సేకరించారు. ల్యాబ్‌లో పరిశీలించిన అనంతరం ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని ఎస్పీ తెలిపారు.

పెరిగిన రైవాడ నీటిమట్టం

దేవరాపల్లి, సెప్టెంబరు 23: మండలంలోని రైవాడ జలాశయ నీటిమట్టం 112.85 మీటర్లకు చేరింది. జలాశయ గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా, ఆదివారం 50 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. దీంతో జలాశయంలోకి 730 క్యూసెక్కుల వరద నీరు చేరడంతో సోమవారం 112.85 మీటర్లకు నీటిమట్టం చేరింది. నీటిమట్టం 113.50 మీటర్లకు ఏమాత్రం పెరిగినా గేట్లు ద్వారా వరద నీటిని బయటకు పంపుతామని ఏఈఈ నరేష తెలిపారు. ఇరిగేషన్‌కు వంద క్యూసెక్కులు, విశాఖ నగర పాలక సంస్థకు 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు.

భారీ గోతులు.. వాహనదారుల పాట్లు

... 5వ పేజీ తరువాయి

సాయంత్రం లారీ కూరుకుపోగా, సోమవారం బొలేరో వ్యాన్ దిగబడిపోయింది. దీనిని బయటకు తీయడానికి మనుషులతో కుస్తీ పట్టినా ప్రయోజనం లేకపోవడంతో ట్రాక్టర్‌ను రప్పించి, తాళ్లతో బయటకు లాగాల్సి వచ్చింది. వడ్డాది నుంచి రోలుగుంట వరకు లెక్కలేనన్ని గోతులు వున్నాయని, రోడ్డు విస్తరణ పనులు జరిగే వరకు కనీసం గోతులు అయినా పూడ్చాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బది'లీలలు'

... 5వ పేజీ తరువాయి

పోస్టింగులు ఇవ్వడం వెనుక అనకాపల్లి, విశాఖపట్నం సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ విభాగంలో ఇద్దరు కీలక ఉద్యోగుల పాత్ర ఉన్నట్టు చెబుతున్నారు.

వాణిజ్య పన్నుల విభాగంలో....

వాణిజ్య పన్నుల శాఖ విశాఖ సర్కిల్ కార్యాలయం పరిధిలో అడ్డగోలుగా బదిలీలు జరిగాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి ఈ శాఖలో 45 మందికిపైగా ఏసీటీఓలు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్‌లకు ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో బదిలీలు చేస్తూ ఈ నెల 21వ తేదీన విశాఖపట్నం జాయింట్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం సాయంత్రానికి ఆ ఉత్తర్వుల్లో మార్పులు చేశారు. కొంతమంది ఉద్యోగులు పైరవీలు చేసుకొని తమకు కావాల్సిన చోటుకు బదిలీ చేయించుకున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో స్పౌజ్ కోటా వినియోగించుకున్నవారికి, గతంలో అవే కార్యాలయాల్లో పనిచేసిన వారికి నిబంధనలకు విరుద్ధంగా మళ్లీ అక్కడే పోస్టింగ్‌లు ఇస్తూ బదిలీలు చేశారు. దీనిపై వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగ సంఘాల నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

జడ్పీలో బదిలీలు

... 5వ పేజీ తరువాయి

నియమించారు. కొత్తగా వచ్చిన వి.అప్పారావుకు వి.మాడుగుల ఎంపీడీవోగా పోస్టింగ్ ఇచ్చారు. చింతపల్లి ఎంపీడీవో పి.ఆశాజ్యోతిని పాడేరు బదిలీ చేసి, ఆమె స్థానంలో కొత్తగా వచ్చిన ప్రేమ్‌సాగర్‌ను నియమించారు. పాడేరులో పనిచేస్తున్న కె.సాయినవీన్‌ను పొరుగు జిల్లాకు కేటాయించారు. జి.మాడుగుల ఎంపీడీవో లోహిత్‌సాగర్ మరో జిల్లాకు వెళ్లగా అతని స్థానంలో కొత్తగా వచ్చిన తేజ్‌రతన్‌ను నియమించారు. అలాగే హుకుంపేట ఎంపీడీవో ఆర్.వెంకటరావు పొరుగు జిల్లాకు వెళ్లగా అతని స్థానంలో కొత్తగా వచ్చిన టి.రమాదేవికి పోస్టింగ్ ఇచ్చారు. ముంచంగిపుట్టు ఎంపీడీవో కె.కిరణ్ కుమార్ ఇతర జిల్లాకు వెళ్లగా ఆయన స్థానంలో కొత్తగా వచ్చిన ఎం.శ్రీసాయిహర్షను, పెదబయలు ఎంపీడీవో విగిన్ బక్కా ఇతర జిల్లాకు బదిలీ కాగా ఆయన స్థానంలో కొత్తగా వచ్చిన కేవీ ప్రసాద్‌ను నియమించారు. కాగా పద్మనాభం (విజయకుమార్), అనకాపల్లి (కేవీ నరసింహారావు), కశింకోట (వీవీ రవికుమార్), కోటవురట్ల (జి.కాశీవిశ్వనాథరావు), రావికమతం (వెంకన్నబాబు), డుంబ్రిగుడ (ఎం.ఉషారాణి), గూడెంకొత్తవీధి (వై.ఉమామహేశ్వరరావు) ఎంపీడీవోలను అక్కడే కొనసాగించారు. అనంతగిరి ఎంపీడీవో స్టడీ లీవ్‌లో ఉండగా అక్కడ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మాకవరపాలెం, పెందుర్తిలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

☛ సంక్షిప్తంగా..

నేడు చోద్యంలో కోటకొండమ్మ పండగ

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 23: గొలుగొండ మండలం చోద్యంలో గ్రామదేవత కోటకొండమ్మ పండగను మంగళవారం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు గ్రామ సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ తెలిపారు. గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ అలంకరణతోపాటు అమ్మవారి విగ్రహానికి రంగులు వేస్తున్నామన్నారు. సాయంత్ర పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు



పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న ఏరియా ఆస్పత్రి వైద్యులు

నర్సీపట్నం, సెప్టెంబరు 23 : స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో పురపాలక పారిశుధ్య కార్మికులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా కమిషనర్ సురేంద్ర కార్మికులకు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రాంతీయ ఆస్పత్రి వైద్యులు పారిశుధ్య కార్మికులు, నీటి సరఫరా సిబ్బందికి వైద్య పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో ప్రాంతీయ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ సత్యనారాయణ, ఈఎన్‌టీ డాక్టర్ వర ప్రసన్న, జనరల్ మెడిసిన్ వైద్యురాలు లత, చర్మవ్యాధుల నిపుణులు సువర్ణ, గైనికాలజిస్ట్ డాక్టర్ పద్మిని, ఎముకల వైద్య నిపుణులు విద్యాసాగర్, డాక్టర్ శశి పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సంజ్ఞా భాషా దినోత్సం



విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు అందిస్తున్న దృశ్యం

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 23: గొలుగొండ మండలంలోని ఏఎల్‌పురం జడ్పీ హైస్కూల్‌లో సోమవారం జాతీయ సంజ్ఞా భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఉపాధ్యాయుడు తమ్మిల మాణిక్యం దివ్యాంగ విద్యార్థులకు తమ భావాలను సంజ్ఞల, చేతి వేళ్ళ, ముఖ కదలికలు ఉపయోగించి తమ భావాలను ఎలా తెలియజేయాలో వివరించారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, నోట్‌బుక్స్, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగభూషణం, ఉపాధ్యాయులు లోచల రమేష్, మాణిక్యం, టీవీ రమణ, రామ్‌కుమార్, రామరాజు, అచ్చుబాబు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించాలి



ఆర్టీసీ డీఎంకు వినతిపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నేతలు

మాకవరపాలెం, సెప్టెంబరు 23: స్థానిక బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించాలని బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు అంజనేయులు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బత్తుల రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్టీసీ డిపో మేనేజరు జీఎస్ సాయిబాబాకు వారు వినతిపత్రం అందజేశారు. బస్టాండ్‌లో మరుగుదొడ్లు లేక మహిళా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే పారిశుధ్యం అధ్వానంగా ఉందన్నారు. బస్టాండ్ ఆవరణలో పెద్ద గోతులు పడి బస్సుల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షం పడితే నీరంతా నిలిచిపోయి ప్రయాణికులు బస్సులు ఎక్కేందుకు తిప్పలు పడుతున్నారన్నారు. వీటిపై చర్యలు చేపట్టాలని వారు కోరారు.

మహిళ కడుపులో 6 కిలోల కణితి తొలగింపు

చోడవరం, సెప్టెంబరు 23: కడుపు నొప్పితో బాధపడుతున్న ఓ మహిళకు వైద్యులు ఆపరేషన్ చేసి 6 కిలోల కణితిని తొలగించారు. చీడికాడ మండలం పెదగోగాడ గ్రామానికి చెందిన వి.లక్ష్మి అనే మహిళ కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నది. ఆమెను పట్టణంలోని సంజీవిని ఆసుపత్రిలో చేర్పించగా, ఆమెకు ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద రెండు రోజుల క్రితం ఆపరేషన్ చేసి ఆమె కడుపులో ఉన్న 6 కిలోల కణితిని వైద్యులు నిరుపమ, యేసుప్రసాద్ తొలగించారని ఆసుపత్రి ఎండీ ఆదారి చంద్రశేఖర్ తెలిపారు.

నాయుడు వీధిలో అన్న సమారాధన

దేవరాపల్లి, సెప్టెంబరు 23: స్థానిక నాయుడి వీధిలో ఏర్పాటుచేసిన వినాయ క అన్న సమారాధనలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, టీడీపీ నాయకుడు పైలా ప్రసాదరావు పాల్గొన్నారు. ఎంపీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, కిల్లి.గోవింద, గర్భిడ్డి కొండలరావు పాల్గొన్నారు.

తహసీల్దార్లకు మండలాలు కేటాయింపు

... 5వ పేజీ తరువాయి

ఏఓ.శ్రీనివాసరావును రాంబిల్లి తహసీల్దారుగా, రావికమతం నుంచి ఎస్.ఏ.మహేశ్వరరావును మునగపాకకు, నక్కపల్లి నుంచి అంబేడ్కర్‌ను పరవాడకు, నర్సీపట్నం నుంచి బి.రవికుమార్‌ను సబ్బవరానికి, విశాఖపట్నం నుంచి ఎల్.రామారావును నర్సీపట్నానికి, బుచ్చెయ్యపేట నుంచి పి.శ్రీనివాసరావును గొలుగొండకు, ఏఎస్ఆర్ జిల్లా నుంచి వేణుగోపాల్‌ను నాతవరానికి, అనకాపల్లి కలెక్టరేట్ ల్యాండ్స్ సెక్షన్ ఆర్.నర్సింహమూర్తిని నక్కపల్లికి, కశింకోట నుంచి జి.సత్యనారాయణను పాయకరావుపేటకు, కె.కోటపాడు నుంచి జె.రమేశ్ బాబును ఎస్.రాయవరానికి, చోడవరం నుంచి ఎల్.తిరుమలబాబును కోటవురట్లకు, చీడికాడ నుంచి బీవీ రాణిని కలెక్టరేట్ ఏఓగా నియమించారు. నాతవరం నుంచి ఎస్‌వీఎస్ నాయుడు కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్, మాడుగుల నుంచి పీవీ రత్నంను కలెక్టరేట్ ల్యాండ్స్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా, అడబాల శ్రీనివాసరావును కశింకోటకు, ఎ.రామారావును చోడవరం తహసీల్దారుగా నియమించారు.

36 మంది డీటీలు కూడా..

జిల్లాలో 36 మంది డిప్యూటీ తహసీల్దార్లకు బదిలీలు అయ్యాయి. ఐదేళ్లు ఒకేచోట పనిచేస్తున్న వారితోపాటు రిక్వెస్టు ట్రాన్స్‌ఫర్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి బదిలీలు జరిగాయి.